# జనశక్తి

www.janashaktionline.com

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 46 సంచిక : 10 విజయవాడ 20-9-2013 పేజీలు : 8 వెల : రు 5.00



లోపలి పేజీల్లో...

- శ్రీలంక : ఐక్యతకోసం, ప్రజాస్వామ్య హక్కులకోసం పోరాటం
- ప్రపంచవ్యాపితంగా పని ప్రదేశాల్లో 'ప్రమాదాలు' - కార్మికుల దుర్మరణాలు
- జాతీయ భూసంస్కరణల విధాన ముసాయిదా : సంస్కరణలు అంటే అర్ధమేమిటి?
- ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ : గిరిజన యువతులపై ఘోరాలు
- అమలుచేయల్సింది రుణఅర్హతకార్డులు కాదు, కౌలుదారీ చట్టాలు


## గ్రామీణ జీవన సకల విధ్వంసాలకు కారకులైన పాలకులు

## నిత్యజీవన, మౌలిక సమస్యల పరిష్కారానికి సంఘటితపోరాటమే కర్తవ్యం

**గ్రామీణ,** పట్టణ ప్రాంతాలనే తేడాలేకుండా దేశంలోని యావన్మంది ప్రజానీకం దినదినగండంగా బతుకు లీడుస్తున్నారు. ముఖ్యంగా, దేశంలో నూటికి ఎనభైమంది పైగా ఆధారపడివున్న గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయకూలీల, చేతివృత్తిదార్ల, సన్న-చిన్నకారు రైతుల-ముఖ్యంగా కౌలురైతుల జీవనం ప్రశ్నార్థకమౌతోంది. దున్నేవానికి భూమి లేదు. చేతినిండా పనిలేదు. చేతివృత్తులు చితికిపోయాయి ప్రధానంగా దళితులుగా వున్న వ్యవసాయకూలీలు కులవివక్ష, అణచివేత, అగ్రకుల దురహంకార దాడులకు గురౌతున్నారు. చుక్కలు దాటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో, అర్థాకలితో-పస్తులతో బతుకుబండి నీడుస్తున్నారు. ఇక, పిల్లలకు నాలుగు అక్షరమ్ముక్కలు, తలదాచుకోను చిన్నపాటిగూడు, శరీరం కప్పుకునేందుకు జానెడు గుడ్డ కరవై జనాభా లెక్కలలో సంఖ్యగా మాత్రమే మిగిలివున్నారు. ఈడొచ్చిన ఆడపిల్లలకు పెండ్లిళ్ళు చేయలేక, కుటుంబంలో అనారోగ్యానికి గురైన ఒక్కరికి కూడా వైద్యం చేయించుకోలేకున్నారు. రక్షిత మంచినీటికి నోచుకోక కలుషిత జలాలతో నిరంతర రోగగ్రస్తులవుతున్నారు. అంగవైకల్య జననాలు, పోషకాహారలోపం, శిశుమరణాలు, అజ్ఞానం, మూఢనమ్మకాలతో ముంచెత్తబడివున్నారు. మండే ఎండలకు, జడివానలకు, చలిగాలులకు పండుటాకుల్లా అసంఖ్యాకంగా రాలిపోతున్నారు.

రైతులు-ప్రతి వ్యవసాయ సీజనులో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు అనూహ్యంగా పెరగటం; బ్యాంకులద్వారా ప్రభుత్వరుణాలు లభించక ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడాల్సిరావటం; ప్రభుత్వం సబ్సిడీలన్నింటినీ దిగకోయటం; సాగునీటి సమస్యలు, కరెంటు కష్టాలకు తోడు ప్రకృతి విపత్తులు తోడవటం; చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధరకాదుగదా, ప్రభుత్వ కనీసమద్దతు ధర లభించకపోవటం; మార్కెట్ దళారీల కపటనాటకాలతో ప్రతి ఏడాదీ రుణఊబిలో అంతకంతకూ కూరుకుపోతున్నారు; బయటపడేదారికానక గత రెండు దశాబ్దాల కాలంలోనే మూడున్నర లక్షలమందికి పైగా రైతులు బలవన్మరుణాల పాల్పడటమే, నేటి వ్యవసాయరంగ సంక్షోభ తీవ్రతను చాటిచెప్తున్నది.

ప్రపంచంలోనే అత్యధికంగా మనదేశంలో సాగుకు యోగ్యమైన భూములు 60 కోట్ల ఎకరాలు వున్నాయి. అందులో ఇప్పటికి మొత్తంగా సాగులోకి తెచ్చిన భూమి 30 కోట్ల ఎకరాలు మాత్రమే. భూసంస్కరణచట్టంలోని లొసుగుల నడ్డుపెట్టుకొని అనేకమంది భూయజమానులు బినామీ పేర్లతో వందల, వేల ఎకరాలకు తమ గుప్పెటలోనే పెట్టుకున్నారు. ఏమైనా, చట్టప్రకారం మిగులు భూములుగా లెక్కదేల్చామన్న 6 కోట్ల ఎకరాలలోనూ ఒక్కశాతం మాత్రమే పంపిణీ చేయగలిగామని ప్రభుత్వమే నిస్సిగ్గుగా చెపుతోంది. మరోవైపున, ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఈనాటికీ గ్రామీణ జనాభాలో 31 శాతం పైగా కుటుంబాలకు సెంటు భూమిలేదు. సాగవుతున్న భూములలో కూడా, సమాజంలో 60శాతంగావున్న అట్టడుగు వర్గాల ప్రజల చేతుల్లో కేవలం ఐదుశాతం భూమి మాత్రమే వుంది. కాగా, సమాజంలో 10శాతంగావున్న ధనికవర్గాల చేతుల్లో 50శాతం భూములు పోగుబడి వున్నాయి.

ఇక, ఉత్తరాన గంగమొదలు, దక్షిణాన కావేరి వరకు మనదేశంలో జీవనదులు లెక్కకు మిక్కిలిగా వున్నాయి. 'ప్రవహించే బంగారమైన' ఈ జలసంపదను నిల్వచేసి, సాగునీరు, తాగునీరు, విద్యుత్తు నందించే పథకాలు చేపట్టకపోవటంతో, ఈనాటికీ అపార జలనిధి సముద్రాల పాలవుతోంది.

కనుక, సాగుకు యోగ్యమైన భూఖండాలను, అంతులేని జలవనరులను, అపార మానవశ్రమశక్తిని అనుసంధానం చేయగలిగితే, నిస్సందేహంగా మనదేశ జనాభాకు రెట్టింపు సంఖ్యలో ప్రజలకు ఆహారధాన్యాలను అందజేయవచ్చు.

ఐతే, సామాన్యుడికి సైతం అత్యంత సులభంగా అర్థమయ్యే ఈ అంశం, మనదేశ పాలకులకు తెలియనిదేమీ కాదు. గత ఆరున్నర దశాబ్దాల దళారీ పాలకుల ఉద్దేశపూరిత నిర్లక్ష్యం కారణంగానే, అసంఖ్యాక భూములు పడావుగా పడివున్నాయి. అంతులేని జలసంపద ఉప్పునీటి పాలవుతోంది. ఏతావాతా, విశాల గ్రామీణ ప్రజానీకం వ్యవసాయం గిట్టుబాటుగాక, కనీస ఉపాధికరవై పొట్టచేతబట్టుకొని ప్రవాహంలా వలసలబాట సాగుతున్నారు. పాలకులు, వీరిని తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి నిరంతరం ఎదురుచూపులు చూసే వారిగా మిగల్చజూస్తున్నారు మినహా, సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోరనేది స్పష్టం.

ప్రధాన ఉత్పత్తిసాధనమైన భూమి పంపిణీ జరగకుండా, వ్యవసాయానికి పెద్దఎత్తున ప్రోత్సాహకాలు కల్పించి దిగుబడులు పెంచకుండా, వ్యవసాయ ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమలు స్థాపించకుండా-వాస్తవ అర్థంలో స్థూల జాతీయ అభివృద్ధి, తలసరి ఆదాయాల పెరుగుదల సాధ్యం కావు. ఆనాడే ప్రజలు తమకు అవసరమైన పారిశ్రామిక ఉత్పత్తులను, ఇతర సరుకులను కొనుగోలుచేయగలుగుతారు. ప్రజలందరి ఈ అవసరాలు తీర్చటానికి తిరిగి అధికసంఖ్యలో పరిశ్రమల స్థాపన అనివార్యమౌతుంది. తద్వారా వ్యవసాయ, పారిశ్రామికరంగాల్లో ఉపాధి, ఉద్యోగవకాశాలు గణనీయంగా పెరిగి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మార్గం సుగమమౌతుంది.

పదకొండు పంచవర్ష ప్రణాళికలు పూర్తయినా, వాస్తవ అర్థంలో ప్రజల సమగ్రాభివృద్ధికి అవసరమైన ఈ పథకాలు అమలుచేయకపోగా, అభివృద్ధిపేరిట పాలకులు ప్రజాజీవన విధ్వంసానికి పాల్పడుతున్నారు. చిన్నచితకా రైతుల భూములను కూడా గుంజుకొని బడాకంపెనీలకు కట్టబెడుతున్నారు; మనదేశ సహజ సంపదను వారికి దోచిపెడుతున్నారు; మన ప్రజల శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొడ్తున్నారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని రాయితీల పేరిట వారికి ధారాదత్తంచేస్తున్నారు. దాని ఫలితమే ఆగని, ఎడతెగని ఈ జీవన విధ్వంసం!

దేశీయ పరిశ్రమల అభివృద్ధిలేదు; ఉన్న పరిశ్రమలకే మనుగడలేదు; దేశీయ అవసరాలకు అనుగుణమైన ఆవిష్కరణలు లేవు. కేవలం సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, బడాపెట్టుబడిదారుల ప్రయోజనాలే పరమావధిగా దుర్మార్గమైన విధానాలు అమలుచేస్తున్నారు. ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలను అమ్మివేస్తున్నారు. దేశరక్షణ రంగ పరిశ్రమతోసహా అన్నిరంగాలలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచారు. రిటైల్ రంగంలోకి సామ్రాజ్యవాద వ్యాపార కంపెనీలను అనుమతించి కోట్లమంది చిన్నవ్యాపారుల పొట్టగొడ్తున్నారు.

ప్రజలను ఇన్ని విధాలా కష్టాల పాల్జేస్తున్న పాలకులు, ఎన్నికలలో తమ గెలుపును ఖాయం చేసుకునేందుకు, ప్రజలను సరికొత్తగా భ్రమలలో ముంచేందుకు ఎప్పటికప్పుడు కొత్త పాచికలను ప్రయోగిస్తూవస్తున్నారు. దేశంలోని 82 కోట్లమందికి (67శాతానికి) ఒక్కొక్కరికి నెలకు 5 కిలోల ఆహారధాన్యాలను రాయితీపై (బియ్యం కిలో 3 రూ॥కు, గోధుమలు కిలో 2 రూ॥కు, తృణధాన్యాలు కిలో 1 రూ॥చొ॥న) అందజేస్తామంటూ ఇటీవలే **(తరువాయి 2వ పేజీలో)**

## దురాక్రమణకు దౌత్య ముసుగువేస్తున్న సామ్రాజ్యవాదులు

**గల్ఫ్** ప్రాంతంలోని చమురు వనరులపై ఆధిపత్యం పొందటం ద్వారా ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకోవాలన్న అమెరికా సామ్రాజ్యవాదం గల్ఫ్ ప్రాంత దేశాలను పాదాక్రాంతం చేసుకునేందుకు పూనుకుంది. దీనికోసమే ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల దురాక్రమణ యుద్ధం సాగిస్తున్నది. తన విధానాలకు లోబడని ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. సిరియాపై నిరంతరం దాడులు చేస్తానంటూ ప్రకటిస్తున్నది. ముస్లిం మతోన్మాదశక్తులను పెంచి, పోషించి, ఆయుధాలందించి గల్ఫ్ దేశాలలో అంతర్యుద్ధ స్థితిని కల్పిస్తున్నది. ఈ నేపధ్యంలోనే సిరియా పరిణామాలను పరిశీలించాలి.

సిరియాలోకి వందలాది ముస్లిం టెర్రరిస్టు శక్తులను డబ్బులు, ఆయుధాలు యిచ్చి చొరబెట్టింది. వీటితో సిరియా నేషనల్ కౌన్సిల్ అన్నదానిని సౌదీ అరేబియాలో ఏర్పాటుచేసింది. దీనినే సిరియా ప్రభుత్వానికి ప్రతిపక్షంగా పేర్కొంటూ, అస్సాద్ ప్రభుత్వాన్ని కూలద్రోయాలని పూనుకుంది.

దీనిలో భాగంగానే సిరియా ప్రజలపై అస్సాద్ ప్రభుత్వం రసాయనిక ఆయుధాలు ప్రయోగించిందంటూ ఆరోపణలు చేసింది. ఈనాటివరకూ దీనికి ఎలాంటి ఆధారాలూ చూపలేదు. రసాయనిక ఆయుధాలలో అమాయక ప్రజల వధను నిలిపివేసేందుకు సిరియాపై దాడిచేస్తానని ప్రకటించింది.

అయితే సిరియాపై దాడికి అమెరికా పార్లమెంటు ఉభయసభల్లోనూ ఆమోదం పొందటం సాధ్యపడదని తెలియటంతోనూ, మరొక యుద్ధాన్ని సాగించటంపట్ల అమెరికా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతరావటంతోనూ, సిరియాపై దాడికి ఐరాస భద్రతా మండలిలో తీర్మానం ప్రవేశపెడితే రష్యా, చైనాలు వీటో చేస్తాయని స్పష్టమవటంతోనూ, అమెరికా అధ్యక్షుడు ఒబామా ఒకడుగు వెనక్కివేసి దౌత్యమార్గాల్లో పరిష్కారానికి ప్రయత్నంచేసి శాంతియుత పరిష్కారానికి మరో అవకాశం యిచ్చి చూస్తానని ప్రకటించాడు. అయినా సిరియాపై యుద్ధ ప్రయత్నాలను అది మానుకోలేదు.

ఒబామా చెప్పిన దౌత్యమార్గాల్లో రష్యా చేసిన ప్రతిపాదన ఒకటి. సిరియా వద్దనున్న రసాయనిక ఆయుధాలను ఒక అంతర్జాతీయ పర్యవేక్షణ బృందానికి అప్పగించాలి. ఆ బృందం వాటిని 2014 మార్చినాటికి నిర్వీర్యం చేయాలి అని రష్యా ప్రతిపాదించింది. దీనిపై రష్యా, అమెరికాల మధ్య చర్చలు జరిగాయి. తన వద్ద ఇంకా రసాయనిక ఆయుధాలులేవని అస్సాద్ ప్రభుత్వం ఎలాంటి సందేహానికీ తావులేకుండా నిరూపించుకోవాలనీ, ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు తెలిస్తే సిరియాపై దాడిచేసే అధికారం అమెరికాకు ఉండాలనీ, అమెరికా పట్టుపట్టింది. అయినా చివరకు రష్యా ప్రతిపాదనకు ఒప్పుకుంది. సిరియా ఈ ప్రతిపాదనను అంగీకరించింది. రసాయనిక ఆయుధాల సదస్సు తీర్మానంపై సంతకం చేయటానికి సిద్ధమైంది.

1993లో రసాయనిక ఆయుధ సదస్సు జరిగింది. ఈ సదస్సు రసాయనిక ఆయుధాల తయారీనీ, వినియోగాన్నీ, అమ్మకాలనూ నిషేధించింది. 189 దేశాలు దీనిపై సంతకాలు చేశాయి. దీనిపై సంతకం చేసిన ఇజ్రాయిల్ ఇంతవరకూ దానిని ఆమోదిస్తూ తీర్మానం చేయలేదు. మయన్మార్, అంగోలా, ఉత్తరకొరియా, ఈజిప్టు, దక్షిణసూడాన్, సిరియా దేశాలు దీనిపై సంతకాలు చెయ్యలేదు. సదస్సు రసాయనిక ఆయుధాలపై నిషేధం విధించిందిగానీ దానిని అమలు జరిపేందుకు తగిన యంత్రాంగాన్నిగానీ, విధివిధానాలనుగానీ రూపొందించలేదు. 1950-53లో ఉత్తర కొరియాపై మొదటిసారిగా రసాయనిక ఆయుధాలను వాడిన అమెరికా సామ్రాజ్యవాదం, ఈనాడు సదస్సు తీర్మానాన్ని అమలుజరిపే పోలీసు బాధ్యతను తానే తీసుకుంది.

సదస్సు తీర్మానంచేసి 30ఏళ్ళు గడిచినా, తీర్మానాన్ని అమెరికా పార్లమెంటు ఆమోదించినా, ఇప్పటికీ అమెరికా రసాయనిక ఆయుధాలను తయారు చెయ్యటం మానలేదు. నిల్వలను నిర్వీర్యం చెయ్యలేదు. ఫ్రాన్సు వేసిన అంచనా ప్రకారం, అమెరికా వద్ద నేడు 3వేల టన్నుల రసాయనిక ఆయుధాలున్నాయి. తీర్మానంపై సంతకంచేసిన ఇజ్రాయిలు వద్ద కూడా ఇన్ని ఆయుధాలు ఉన్నాయి. సంతకం చెయ్యని ఈజిప్టు వద్ద రసాయనిక ఆయుధాలున్నాయి. వాటిని యెమెన్‌లో తిరుగుబాటుదారులను అణచివేసేందుకు వాడానని కూడా చెప్పింది. తానూ, తన తైనాతీలు రసాయనిక ఆయుధాలు కలిగి వుండటం ఆత్మరక్షణచర్య అట, కాగా ఇతరులు కలిగివుంటే దుర్మార్గమట! అమెరికా సామ్రాజ్యవాదం మరోసారి తన దురాక్రమణ స్వభావాన్ని బయటపెట్టుకుంది.

అమెరికా, రష్యాల మధ్య కుదిరిన ఒప్పందం కూడా సామ్రాజ్యవాద ఆధిపత్య స్వభావాన్నే కలిగివుంది. ఒకటి : సిరియాకున్న రసాయనిక ఆయుధాలను ఒక అంతర్జాతీయ పర్యవేక్షణ బృందానికి అప్పచెప్పి, వాటిని నిర్వీర్యం చెయ్యాలన్న అంశం అమలుజరిగితే, అది సిరియాలోకి విదేశీ సైనిక ప్రవేశాన్ని ఆమోదించటమే. ఈ ఆయుధాలను స్వాధీనం చేసుకోవటానికి కనీసం 8నెలలు పడుతుంది. వాటిని నిర్వీర్యం చేసేందుకు కనీసం రెండేళ్ళు పడుతుంది. ఇక్కడ ఏమాత్రం తొందరపడ్డా ప్రమాదాలు జరిగి, రసాయనాలు విడుదలై వినాశానికి దారితీస్తుంది. నిర్వీర్యంచేసే ప్రక్రియ అతినెమ్మదిగా, అత్యంత జాగరూకతతో సాగాలి. కనీసం మూడేళ్ళపాటు ఈ ఆయుధాలు టెర్రరిస్టుల చేతిలో పడకుండా చూడటమనే సాకుతో ఒక అంతర్జాతీయ సైనికబృందాన్ని పంపుతారు. ఈ సైనికబృందంలో చేరటానికి అమెరికా, ఫ్రాన్సులే ముందుంటాయి. ఆ విధంగా సామ్రాజ్యవాదుల సైనికులు సిరియాలో కాలుమోపుతారు. తిరుగుబాటుదారులనబడే తన తైనాతీలకు వత్తాసుగా **(తరువాయి 2వ పేజీలో)**

# తొలితరం కమ్యూనిస్టు కా॥ సుంకర శివరామయ్యకు జోహార్లు



**1919లో** ఈడ్పుగల్లు గ్రామంలో జన్మించిన సుంకర శివరామయ్య (94 సం॥లు) 13-9-13న విజయవాడలో కన్నుమూశారు. వారి కుటుంబం అటు జాతీయోద్యమంలో ఇటు కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొని, ఎన్నో త్యాగాలు చేసింది. ఎంతో ఆదర్శంగా నిలబడింది. ఈయన సోదరులు ప్రముఖ రచయిత, కవి సుంకర సత్యనారాయణ, సుంకర వీరభద్రరావు, సుంకర సుబ్బారావు, సోదరి అన్నే అనసూయలు పూర్తికాలం కమ్యూనిస్టు ఉద్యమ ఆశయాలకోసం అంకితమయ్యారు. కా॥ శివరామయ్య తను స్వయంగా కౌలురైతుగా పనిచేయడమేగాక, కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక క్రియాశీలకార్యకర్తగా 1960 దశకం వరకు పనిచేశారు. 1943లో విజయవాడలో జరిగిన అఖిలభారత రైతుమహాసభల విజయానికి అవసరమైన నీరు, భోజన ఏర్పాట్లకు అవసరమైన వస్తుసామాగ్రిని తన ఎడ్లబండితో సరఫరాచేస్తూ రాత్రింబవళ్ళు కృషిచేశారు. బందరుకాలువ పూడిక తీయడంలో కూడా ఒక కార్యకర్తగా వుండి పనిచేశారు. ఆనాడు శివరామయ్య ఒక కార్యకర్తగా మరియు కొరియర్‌గా వుండి కమ్యూనిస్టుపార్టీ అప్పగించిన పనులను, కార్యక్రమాలను శక్తివంతంగా నిర్వహించారు. పార్టీపనులు నెరవేర్చడంలో ఎంతో శ్రమించేవారు. ఆనాడు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన సాగిన తెలంగాణ రైతాంగ పోరాట కాలంలో అనారోగ్యరీత్యా వచ్చే పార్టీ కార్యకర్తలను, నాయకులను ఆదుకోవడంలో, అండదండలందించడంలో తనవంతు పాత్రను నిశ్శబ్దంగా పోషించారు. వ్యవసాయంలోను, కొండరాళ్ళను కొట్టడంలో ఎన్నో అనుభవాలను గడించిన నిపుణులు, దిట్ట, శ్రమజీవి!

ఆనాడు కమ్యూనిస్టు ప్రభావంతో సమాజంలో, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో ఎన్నో వితంతు వివాహాలు జరిగాయి. శివరామయ్య కూడా వితంతు వివాహం చేసుకున్నారు. కామ్రేడ్ అన్నపూర్ణ కమ్యూనిస్టుపార్టీ కార్యకర్త, మంచి గాయని కూడా. దంపతులిరువురూ కమ్యూనిస్టుపార్టీ పాటలను ఎంతో స్ఫూర్తిదాయకంగా ఆలపించేవారు.

కా॥ శివరామయ్య కష్టపడి తన పిల్లలను చదివించారు. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కా॥ శివరామయ్య మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి సంతాపం ప్రకటిస్తూ ఆ కామ్రేడ్‌కు జోహార్లర్పిస్తోంది. వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియపరుస్తోంది.

13-9-13న కా॥ శివరామయ్య మరణవార్త తెలియటంతోనే వివిధ కమ్యూనిస్టుపార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, మిత్రులు, బంధువులు పెద్దసంఖ్యలో హాజరై కడసారి నివాళులర్పించారు. 15-9-2013న విజయవాడలోని అమ్మ కళ్యాణమండపంలో జరిగిన ఆయన సంతాపసభలో సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ గుర్రం విజయకుమార్‌తోపాటు, సిపిఐ, సిపిఎం, ఎంసిపిఐ తదితర పార్టీల, వివిధ ప్రజాసంఘాల నేతలు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాకళాకారులు పాల్గొని కా॥ శివరామయ్యకు ఘనంగా జోహార్లర్పించారు.

# భూటాన్ ఆంతరంగిక విషయాల్లో భారతదేశ జోక్యాన్ని ఖండించండి

**భారతదేశ** బడాబూర్జువావర్గ ప్రభుత్వానికి ప్రాంతీయ విస్తరణవాద కోర్కెలున్నాయనేది నిరాకరించవీలులేని వాస్తవం. వ్యూహాత్మక ప్రయోజనాల పేరిట పదేపదే భారత ప్రభుత్వం పొరుగుదేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకుంటూ, బ్రిటీష్ వలసవాదుల కాలంనాటి నుండి నేటివరకూ అదే విధానాలను అనుసరిస్తూ వస్తున్నది.

హిమాలయ పర్వత సానువుల్లోని మూడు చిన్న దేశాలైన నేపాల్, భూటాన్, సిక్కింలు భారత విస్తరణవాద విధానానికి బాధిత దేశాలుగా వున్నాయి. ఈ దేశాలను తనకనుగుణంగా లొంగదీసుకునేందుకు భారతప్రభుత్వం ప్రజాస్వామ్యమనే కార్డునుపయోగిస్తూ వస్తున్నది. సిక్కిం రాజు స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించే ప్రయత్నంచేయగా, భారత ప్రభుత్వం ఆ రాజుకు వ్యతిరేకంగా ఆ దేశంలో సాగిన తిరుగుబాటును పయోగించుకుని 1975లో ఇండియన్ యూనియన్‌లో కలిపేసుకుంది.

నేపాల్ ప్రభుత్వం భారత ప్రభుత్వ విధానాలకు అభ్యంతరం తెలిపినందుకుగానూ ఆ దేశాన్ని బలవంతంగా లొంగదీసుకునేందుకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1989లో ఆర్థిక దిగ్బంధం విధించింది. 'నేపాలీ కాంగ్రెస్' ద్వారా నేపాల్ ఆంతరంగిక విషయాల్లో భారత ప్రభుత్వ నిరంతరాయ జోక్యం అందరికీ తెలిసిందే. అదేవిధమైన బెదిరింపు విధానాన్నే భూటాన్ విషయంలోనూ అనుసరిస్తున్నారు.

మరే ఇతర రోడ్డుమార్గాలులేని పరిస్థితుల్లో, ఇతర దేశాలతో సంబంధాలు నెరపటానికి భూటాన్ భారతదేశంపై ఆధారపడుతున్నది. షుమారు 95శాతం ఈ దేశపు వ్యాపారమంతా భారతదేశంతోనే జరుగుతుంది. భారత ప్రభుత్వానికి చెందిన 7.5లక్షలమంది సైన్యం భూటాన్‌లో తిష్టవేసి వుంది. 1949లో భూటాన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం, భూటాన్ విదేశాంగ విధానంపై భారత ప్రభుత్వానికి అదుపువచ్చింది. దీని స్థానంలో 2007లో మరో స్నేహ, సహకార ఒప్పందం చేసుకున్నప్పటికీ, ఈ ఒప్పందాన్ని పాటించకుండా వుండేందుకు చేతులు మెలిపెట్టే పద్ధతులకు భారత్ పూనుకుంది.

2013 జులై ఒకటిన, భారత ప్రభుత్వం - భూటాన్‌కు ఎప్పటినుండో సరఫరాజేసే వంటగ్యాసు మరియు కిరోసిన్‌లపై సబ్సిడీని రద్దుచేసింది. దీనితో వెనువెంటనే భూటాన్‌లో వీటి ధరలు రెట్టింపయ్యాయి. భూటాన్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిస్థితిని తనకనుకూలంగా ప్రభావితం చేసుకొనేందుకు భారత ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. బ్రెజిల్లో జరిగిన 'ఎర్త్‌సమిట్-2012' సందర్భంగా భారత ప్రభుత్వ ముందస్తు 'అనుమతి' పొందకుండా భూటాన్ డిపిటి పార్టీ ప్రధానమంత్రి జిగ్మెథైన్‌లే చైనా ప్రధానమంత్రిని కలుసుకున్నాడు. అతను చైనాతో సౌహార్ద్ర సంబంధాలు పెంపొందించుకునే ప్రయత్నం చేశాడు. ఆ తదనంతరం జరిగిన ఎన్నికలలో డిపిటి ఓడిపోయి, పిడిపి అధికారంలోకి వచ్చింది. చట్టసభలోని మొత్తం 47 స్థానాలకుగాను 32స్థానాలను పిడిపి కైవసం చేసుకుంది. ఆ తర్వాత భారత ప్రభుత్వం సబ్సిడీని పునరుద్ధరిస్తున్నట్లుగా ప్రకటన చేసింది.

భూటాన్‌కు అందించే 50కోట్ల సబ్సిడీ ఉపసంహరణ అతిస్వల్ప సాధారణ, పరిపాలనా సంబంధ విషయంగా భారతప్రభుత్వ ఉన్నతాధికారులు కొట్టిపారేస్తున్నప్పటికీ, గతంలోవలెనే భారతప్రభుత్వం తన ఆర్థిక బలంతో భూటాన్ ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకుంటున్నదనేది స్పష్టం! ఈ విధమైన భారతప్రభుత్వ విస్తరణవాద, జోక్యందారీ విధానాలను దేశంలోని ప్రజాస్వామిక శక్తులన్నీ తీవ్రంగా ఖండించాల్సిన అవసరముంది. ✶

## గ్రామీణ జీవన సకల... (మొదటిపేజీ తరువాయి)

'ఆహారభద్రతా చట్టాన్ని' తెచ్చారు. లక్షా ఇరవై అయిదువేల కోట్ల రూ॥ల ఖర్చుతో ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక సంక్షేమపథకంగా గొప్పలు చెప్పుకుంటున్నారు. నిజానికి ఇప్పటికే వివిధ రాష్ట్రాలలో అమలవుతున్న సమగ్రశిశు అభివృద్ధి పథకమూ, అంత్యోదయ, మధ్యాహ్న భోజన పథకం వంటి కేంద్ర, రాష్ట్ర పథకాలన్నింటినీ ఈ ఆహారభద్రత పథకం క్రిందకు తీసుకువచ్చారు. ఈ పథకాలన్నింటికీ వెచ్చిస్తున్న నిధులన్నింటినీ ఆహారభద్రత చట్టం పరిధిలోకితెచ్చి, కొత్తగా 5 కోట్ల ఆహారధాన్యాలను, లక్షలకోట్ల ధనాన్ని వెచ్చిస్తున్నట్లుగా వంచనకు పాల్పడుతున్నారు.

దేశంలో గ్రామీణ నిరుద్యోగాన్ని రూపుమాపేందుకంటూ భారీ ప్రచారార్భాటాలతో వేలకోట్ల వ్యయంతో 2005లో ప్రారంభించిన గ్రామీణ ఉపాధి హామీపథకం నిలువెల్లా అవినీతిలో కూరుకుపోయింది. వందరోజుల పనిగ్యారంటీ బండారం తేలిపోయింది. వలసలను ఆపలేకపోగా, క్రిందిస్థాయి దొంతరలకు ఫలహారపథకంగా మారిపోయిన తరహాలోనే ప్రస్తుత ఆహారభద్రతా చట్టం కూడా పేదలకు ఆహారభద్రత కల్పించలేదనేది స్పష్టం.

ఇటీవల ప్రభుత్వం విడుదలచేసిన జాతీయ భూసంస్కరణల ముసాయిదా ఉదాత్త పదజాలంతో, ఇప్పటివరకూ భూసంస్కరణలు అమలుకాకపోవటానికి కారణాలను మరుగుపరిచింది. 'సమాజపుటంచులకు నెట్టివేయబడ్డ ప్రజలకు' పంపిణీ చేయటానికి మిగులు భూములే లేవంటూ గరిష్ట భూపరిమితిని కుదించాలని గంభీరంగా సూచిస్తోంది. బడా పారిశ్రామికవేత్తలకు భూమి కట్టబెట్టేందుకు నూతన తరహా నాటకాలు మినహా ఇది మరోటికాదు. ప్రభుత్వ బలవంతపు భూసేకరణకు అడ్డుతగిలే హక్కులన్నింటినీ పరోక్షంగా రద్దుచేసే విధంగా ఇటీవలే కేంద్రం 'భూసేకరణ చట్టాన్ని' చేసింది.

సమాజంలో-పీడితుల్లోకెల్లా అథమాథములుగా వున్న ఆదివాసుల కడగండ్లకు అంతులేకుండా వుంది. ఆదివాసుల అసంతృప్తి పెల్లుబికినప్పుడు వారి రక్షణ కోసమంటూ కొన్ని చట్టాలు చేసి, ఆపై వాటిని అలంకారప్రాయంగా మిగులుస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో భూబదలాయింపులను నిరోధించే 1/70 చట్టం, ఆదివాసీ హక్కుల చట్టం, పంచాయితీరాజ్ విస్తరణచట్టం(పెసా)వంటి చట్టాలనన్నీ బేఖాతరుచేస్తూ విశాల అటవీ ప్రాంతాలను బడా, బహుళజాతి సంస్థలకు వివిధ ముసుగులలో కట్టబెడ్తున్నారు. విచక్షణా రహిత అడవుల విధ్వంసం, అక్రమగనుల తవ్వకాలు సాగిస్తూ అడవితల్లి ఒడినుండి ఆదివాసీ బిడ్డలను నిర్వాసితులుగా విసరిపారేస్తున్నారు. అనేక అటవీ ప్రాంత గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటించకుండా కాలయాపనజేస్తూ, ఆదివాసులకున్న కనీసపాటి రక్షణలను నిరాకరిస్తున్నారు. ఆదివాసుల నిరసనలు తీవ్రమవటంతో, గ్రామసభల ఆమోదం లేకుండా షెడ్యూల్డు ప్రాంతాల్లో గనుల తవ్వకం చేపట్టరాదంటూనే, ప్రభుత్వం అత్యావశ్యకమని భావిస్తే గ్రామసభతో కలిసి తవ్వకాలు జరపాలనీ, తద్వారా వచ్చే రాయల్టీలో సగం గ్రామసభకు చెల్లిస్తామంటూ నాటకాలాడుతున్నారు.

గత 66 సంవత్సరాల 'స్వతంత్ర' పాలనలో ప్రజల వాస్తవ, మౌలిక, జీవన సమస్యలను వేటినీ పరిష్కరించని పాలకులు, ప్రజాగ్రహం తమపైకి మరలకుండా ప్రజలను మత్తులో ముంచెత్తటానికి, సంస్కరణ భ్రమలతో జోకొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను పెంచి ప్రజలను విభజించి తమ పాలనను సజావుగా సాగించుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. వీటిని అధిగమించి ప్రజలు నిర్మాణయుతంగానో, అప్రయత్నంగానో వీరి దోపిడీవిధానాలపై ఎక్కుపెట్టి వీధుల్లోకి వస్తే పోలీసు బలగాలతో నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ప్రజలు మరింతగా సంఘటితమై తమ నిత్యజీవన, మౌలిక సమస్యల పరిష్కారానికై పోరాటంసాగించాలి. గ్రామీణ జీవన సకల విధ్వంసాలకు కారకులైన పాలకులపై మొనను ఎక్కుపెట్టాలి. ✶





**అణచబడ్డ దళితులంతా తిరగబడండి**

పేజీలు : 144

వెల : రు. 50/-

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2


## దురాక్రమణకు ... (మొదటిపేజీ తరువాయి)

ఈ సైన్యం వ్యవహరిస్తుంది. ఇది దురాక్రమణతో సమానమౌతుంది.

రెండు : ఆత్మరక్షణకు ఆయుధాలు కలిగి వుండే హక్కు అన్ని దేశాలకూ వుంది. సిరియా ప్రజలపై అస్సాద్ ప్రభుత్వం రసాయనిక ఆయుధాలు ప్రయోగించిందన్న నిరాధార ఆరోపణతో ఆయుధాలు కలిగివుండే సిరియా హక్కును ఈ ఒప్పందం కాలరాస్తుంది. ఒక తీర్మానం చేసి, దానిని అమలు జరపకుండా, సామ్రాజ్యవాదులు తాము గుట్టలు గుట్టలుగా రసాయనిక ఆయుధాలు కలిగివుంటూ, మూడవ ప్రపంచదేశాలు ఆయుధాలు కలిగి వుండరాదన్న ఆంక్షను విధించటాన్ని ఈ ఒప్పందం ఆమోదిస్తుంది. మూడవప్రపంచదేశాలను నిరాయుధం చేసి, తమ ఆయుధబలంతో వాటిని అణచివేసేందుకు సామ్రాజ్యవాదులు పన్నిన కుట్ర యిది.

ఈ కుట్రలో అమెరికాతో రష్యా చేతులు కలిపి తన సామ్రాజ్యవాద స్వభావాన్ని బయటపెట్టుకుంది. సిరియా తరపున రష్యా వాదించటమూ, ఐరాసలో తీర్మానం పెడితే వీటో చేస్తానని రష్యా చెప్పటమూ సిరియాపై ప్రేమతోకాదు. మూడవ ప్రపంచదేశాల హక్కుల రక్షణకు కాదు. వాటిని హరించేందుకేనన్నది స్పష్టం. ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానం నుండి, ఇతర సామ్రాజ్యవాద దేశాలలోని ప్రైవేటు గుత్తపెట్టుబడి విధానానికి పరివర్తనచెందే దశలో ఎదురైన ఇబ్బందులతో వెనక్కు తగ్గిన రష్యా సామ్రాజ్యవాదం ఇప్పుడు తన శక్తిని ప్రదర్శించేందుకు పూనుకుంది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై దురాక్రమణలప్పుడు చూస్తూ వూరకున్న రష్యా, ఇప్పుడు అమెరికా ఆధిపత్యవిస్తరణను అడ్డుకుని తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకునేందుకు పూనుకుంది. రెండు సామ్రాజ్యవాద దేశాలుగా వాటి మధ్యనున్న పోటీ, కుమ్మక్కులను ఈ ఒప్పందం బహిర్గతం చేసింది.

సామ్రాజ్యవాదుల ఈ కుట్రలను ప్రపంచ ప్రజలు ఎలుగెత్తి ఖండించాలి. సిరియాపై అమెరికా దురాక్రమణ ప్రయత్నాలను ఖండించాలి. సామ్రాజ్యవాదుల పోటీ కుమ్మక్కులతో గల్ఫ్‌ను రక్తపుటేరుల్లో ముంచుతున్న దురాక్రమణ విధానాలపై ప్రపంచ ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాలి. ✶

# 'మాన్‌శాంటో, క్విట్ ఇండియా'!

**ప్రజల** నుండి వెల్లువెత్తిన వ్యతిరేకతల ఫలితంగా ప్రపంచ జన్యుమార్పిడి విత్తనతయారీసంస్థ 'మాన్‌శాంటో' అనేక యూరపు దేశాల నుండి వైదొలగక తప్పటంలేదు. అదే క్రమంలో 'మాన్‌శాంటో'ను భారతదేశం నుండి వెళ్ళిపొమ్మని డిమాండ్‌చేస్తూ 'మాన్‌శాంటో, క్విట్ ఇండియా' నినాదంతో 8-8-13న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వివిధ రైతుసంఘాల ఆధ్వర్యంలో ఓ నిరసన కార్యక్రమం జరిగింది.

'ఆగస్టు 8 - క్విట్ ఇండియా' స్ఫూర్తితో దేశంలోని వివిధ రాష్ట్రాలనుండి హాజరైన వేలాదిమంది రైతులు 'మాన్‌శాంటో, క్విట్ ఇండియా' అంటూ పెద్ద పెట్టున నినదించారు. 'కేంద్రప్రభుత్వం జీవసాంకేతిక నియంత్రణాధికార బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని' వీరంతా డిమాండ్ చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఒక ప్రతినిధి బృందం ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రం అందించే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యాలయంలో వ్యవసాయశాఖ సహాయమంత్రిని కలిసి అందజేశారు. ప్రతినిధి బృందం, విజ్ఞాపన పత్రంతో పాటుగా దేశీయ విత్తనాలతో పండించిన పత్తితో నేసిన బట్టతో రూపొందించిన జాతీయ పతాకాన్ని కూడా ఆయనకు అందజేసి, ఆగస్టు15-స్వాతంత్ర్యదినోత్సవం నాడు ఈ జాతీయ పతాకాన్ని ఎర్రకోటపై ఎగురవేయవలసిందనే తమ విజ్ఞప్తిని ప్రధానికి తెలియజేయవలసిందిగా కోరారు. దేశీయంగా ఉత్పత్తి చేసిన పత్తితో రూపొందించిన జాతీయ పతాకాన్ని ఎగురవేయటం ద్వారా, బ్రిటీష్ వ్యతిరేక జాతీయ ఉద్యమ స్ఫూర్తిని నింపుకోవాలని, మన విత్తన సార్వభౌమత్వాన్ని కాపాడతామనే సందేశాన్ని దేశ ప్రజలకు అందించినట్లు అవుతుందని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. దేశంలోని పత్తి విత్తనాలలో 93శాతాన్ని అమెరికా వ్యవసాయ వాణిజ్యసంస్థ మాన్‌శాంటో తన అదుపులోకి తీసుకుందని, దీని నుండి బయటపడి మన ఆహారం, మనపంటలను, స్వేచ్ఛను పరిరక్షించుకోవలసిన అవసరాన్ని ఈ నిరసన కార్యక్రమం సందర్భంగా వక్తలు నొక్కి చెప్పారు. వేలాదిమంది రైతులు పాల్గొన్న ఈ నిరసనలో కొందరు పార్లమెంటు సభ్యులతో సహా 250 మంది వివిధ రైతు సంస్థల ప్రతినిధులు పాల్గొని 'మాన్‌శాంటో, క్విట్ ఇండియా' అని రైతులతో గొంతు కలిపి నినదించారు.

**(9-8-13 'ది హిందూ')** ✶

# శ్రీలంక — ఐక్యతకోసం, ప్రజాస్వామ్య హక్కులకోసం పోరాటం

**శ్రీలంకలో** నివసిస్తున్న తమిళ ప్రజలను పూర్తిగా లొంగదీసుకునేందుకు, ఎల్‌టిటిఇని తుడిచిపెట్టేందుకు శ్రీలంక ప్రభుత్వం పెద్ద ఎత్తున దౌర్జన్యపూరితంగా సైనిక చర్య చేపట్టి నాలుగు సం॥లు గడుస్తోంది. పునరావాస చర్యల గురించి ఆర్భాటపు ప్రకటనలు మినహా, వాస్తవానికి శ్రీలంక తమిళులు నివాస సౌకర్యం, జీవనాధారం, వైద్యసదుపాయాలు, ప్రజాస్వామ్య హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకుండా విషాదకర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. వారంతా అనుమానితులుగా చూడబడుతూ, సైన్యం యొక్క నిఘా పడగనీడలో భయపడుతూ బతుకులీడుస్తున్నారు. సైనిక చర్య క్రమంలో తమిళ ప్రజలపై నీచమైన నేరాలకు, మూకుమ్మడి హత్యాకాండలకు పాల్పడిన వారు ఈ నాటికీ శిక్షించ బడలేదు. రాజ్యాంగంలో 13వ సవరణను చేసి, తమిళులు అధికంగా నివసించే శ్రీలంక ఉత్తర ప్రాంతాలకు అధిక స్వయం పాలనాధికారాలు కట్టబెడతామనే మాటను పాలకులు ఏనాటి నుండో చెప్పుకుంటూ వస్తున్నారు. తమిళులు అధికంగా నివసించే దేశ ఉత్తర ప్రాంత రాష్ట్రాలలో ఎన్నికలు జరిపిస్తే, వేర్పాటువాద ఆలోచనలు, శక్తులు బలపడతాయనే ఏకైక కారణంతో దేశాధ్యక్షుడు రాజపక్సే, ఆ ప్రాంతంలో ఎన్నికల నిర్వహణకు నిరాకరిస్తున్నాడు. ఈ విధంగా శ్రీలంక పాలకులు, తమిళ ప్రజల గొంతుపై కత్తిని వేళ్ళాడదీసి వుంచటంతో, వారు తమ ప్రజాస్వామ్య హక్కుల కోసం, జాతీయ భావనల కోసం, జీవన సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తి అడిగే ధైర్యం చేయలేకపోతున్నారు.

శ్రీలంక పాలకులు తమకు వీలైన అన్ని పద్ధతుల ద్వారా ప్రజలలో నిరంతరం చీలికలు కల్పిస్తూ, పరస్పర శతృత్వాలను పెంచి పోషిస్తున్నారు. ఇటీవల కాలంలో బౌద్ధ బిక్షువులు ముస్లిం ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయటం పెరుగుతోంది. ఇది ప్రభుత్వ విధానాల దుష్పరిణామమే.

2013 మార్చిలో, 'ఫ్యాషన్‌బగ్' అనే కొలంబోలోని ఓ ప్రఖ్యాత దుకాణంపై కొందరు సింహళ బౌద్ధ భిక్షువులు దాడిచేసి విధ్వంసం సృష్టించారు. రాళ్ళు విసిరి దుకాణ ప్రధాన భాగాలను పగులగొట్టడంతోపాటు అనేకమందిని గాయపరిచారు.

2013 మార్చి 28న 'బోధు బాలసేన' అనే ఓ సింహళ బౌద్ధ సంస్థ 'హలాల్' కు వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ప్రచార ప్రభావం దేశంలోని వివిధ ప్రాంతాలలో హలాల్ పత్రం కలిగివున్న ఆహార పదార్థాల విక్రయాలన్నింటినీ బలవంతంగా నిలిపి వేయించింది. ఒక సం॥క్రితం బౌద్ధ బిక్షువులు శ్రీలంక మధ్య ప్రాంతం, దంబుల్లాలోని మసీదుపై దాడిచేశారని గుర్తు చేసుకోవాలి. దేశ జనాభాలో 10శాతంగా వున్న ముస్లిం ప్రజానీకంలో, ప్రస్తుతదాడులు ఎటు దోవతీస్తాయోననే అభద్రతను చాలా సహజంగానే మరింతగా పెంచుతోంది. శ్రీలంకలోవున్న ముస్లిములు, తమిళ భాష మాట్లాడే ఆ దేశవాసులే. జాఫ్నా ద్వీపకల్పంలో ఎల్‌టిటిఇ సంస్థపై ప్రభుత్వం యొక్క తీవ్రమైన దాడుల తర్వాత నుండీ, వారు ఎల్‌టిటిఇకి, శ్రీలంక ప్రభుత్వానికి మధ్యనున్న తగవుకు దూరంగా వుంటూ వస్తున్నారు. పాలక పార్టీలతో రాజకీయ కూటమిని ఏర్పరుకునే పనిలో ముస్లిమ్ నాయకులు నిమగ్నమై వున్నారు.అయిప్పటికీ, వారు దురహంకారానికి, విభజించి పాలించే పాలకవర్గ విధానాలకు బాధితులు కాకుండా తప్పించుకోలేకపోతున్నారు.

ముస్లిములకు చెందిన దుకాణంపై సింహళ బౌద్ధ బిక్షువులు మూకుమ్మడి దాడులకు పాల్పడినప్పుడు పోలీసులు మౌన ప్రేక్షకులుగా వుండటాన్ని కొలంబో మాజీ డిప్యూటి మేయర్ విమర్శించాడు. అందుకుగాను ఆయనను ప్రభుత్వ వ్యతిరేక చర్యల నేరారోపణపై టెర్రరిస్టు నిరోధక చట్టం క్రింద అరెస్టు చేశారు. ఆపై విడుదల చేశారు. పోలీసులు బౌద్ధ సన్యాసులను కూడా కొందరిని అరెస్టు చేశారు. ఈ చర్య దేశంలో శాంతి భద్రతలకు భగ్నం కలిగిస్తున్నదనే కారణంగా, బాధితులే తమఫిర్యాదును ఉపసంహరించుకుంటున్నామని ప్రకటించడంతో ఈ బౌద్ధ సన్యాసులు విడుదలయ్యారు. 'ఫ్యాషన్‌బగ్' సంఘటనలోనూ ఇదే అంశం పునరావృత మైంది. తిరిగి శాంతి, సౌజన్యాలను కాపాడేందుకు ముస్లిమ్ సంస్థ లేబుల్స్ వేసే పద్ధతిని మానుకుంది. దాడులకు పాల్పడిన బౌద్ధ సన్యాసులను సంతృప్తి పరిచేందుకు ఇవన్నీ బలవంతంగా బాధితులపై రుద్దిన ఉపసంహరణలని అర్థం చేసుకోవటమేమంత కష్టంకాదు.

అయినా ముస్లిమ్‌ల సమస్యలు ఆ తర్వాత కూడా కొనసాగుతూనే ఉన్నాయి. కొంతమంది ముస్లిం స్త్రీలు తల, ముఖంపై ధరించే 'నకీబ్'కు వ్యతిరేకంగా ఒక బౌద్ధ సంస్థ తన ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లుగా ప్రకటించింది. ఈ ముస్లిం వ్యతిరేక, దురహంకార చర్యలన్నీ పాలకులు పెంచిపోషిస్తున్నవేననేది బహిరంగ రహస్యమే.

ఏమైనప్పటికీ, శ్రీలంక ప్రజలను మతపరంగా విభజించే పాలకుల ప్రయత్నాలకు వ్యతిరేకతా, ముస్లిం ప్రజానీకానికి సంఘీభావం నానాటికీ దేశంలో పెరుగుతున్నాయి. సెంట్రల్ కొలంబోలోని గ్రీన్‌పథ్ వద్ద 500మంది విద్యార్థులు, యువకులు, వివిధ పార్టీల తరపున ఎన్నికైన ప్రతినిధులు, వృత్తి నిపుణులు ఒక ప్రదర్శన నిర్వహించారు. వారు శ్రీలంకలో ఏహ్యభావానికి స్థానం లేదనే బ్యానర్లను ప్రదర్శించారు. ఇది ఓ ఆహ్వానించదగ్గ పరిణామం.

ప్రజలను తమ వాస్తవ సమస్యల నుండి ప్రక్కకు మళ్ళించేందుకు దోపిడీ పాలకులు ఈ విధంగా ప్రయత్నాలు సాగిస్తుండగా, ప్రజలు తమలో ఐక్యతను పెంపొందించుకుని, ఐక్యపోరాటాలను సాగించడంకోసం కృషి సలుపుతున్నారు.

2013 ఆగస్టు మొదటివారంలో, కొలంబోకు సమీపాన నీటి కాలుష్యానికి వ్యతిరేకంగా చేపట్టిన పెద్ద నిరసన కార్యక్రమమే దీనికి ఉదాహరణ.

ఒక బహుళజాతి సంస్థకు చెందిన పరిశ్రమ నుండి బయటకు వెలువడే మురుగు ప్రవాహం, సమీప గ్రామంలోని బావులన్నిటినీ కాలుష్యానికి గురిచేస్తోంది. వేలాదిమంది ప్రజల ఆరోగ్యానికి ఇది తీవ్రముప్పుగా పరిణమించింది. కాలుష్యానికి గురవుతున్న ప్రజల విజ్ఞప్తులను పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. దీనితో ఆగ్రహించిన ప్రజలు వేలాదిగా వీధుల్లోకి వచ్చారు. కొలంబోకు దోవతీసే రహదార్ల న్నింటినీ దిగ్బంధించారు. సమస్యను పరిష్కరించేందుకు పౌర, పాలనాధికారులకు బదులుగా సైనికులు రంగంలోకి దిగారు. ముగ్గురు యువకులను కాల్చి చంపారు. అనేకమందిని తీవ్రంగా గాయపరిచారు. సైనికులు సాగిస్తున్న దమనకాండను ఫోటోలు తీస్తున్న విలేఖరుల కేమేరాలను బలవంతంగా గుంజుకోవటమే కాకుండా వారిపై కూడా దాడిచేశారు.

స్థానిక సమస్యలపై నిరసనల సందర్భంలోకూడా ప్రత్యక్షంగా చాలా తరచుగా సైనికులే రంగ ప్రవేశం చేయటం, అదేవిధంగా పరిశ్రమల యాజమాన్యాలకు అండగా నిలుస్తూ కార్మికులపై దాడులు సాగించడం శ్రీలంకలోని వివిధ సెక్షన్ల ప్రజానీకాన్ని తీవ్రంగా కలిచివేస్తోంది. సైన్యం యొక్క జోక్యాన్ని, కాల్పులను న్యాయవాదుల సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. శాంతియుత నిరసనాందోళనలకు వ్యతిరేకంగా తీవ్రనిర్బంధాన్ని ప్రయోగించటం ప్రభుత్వం యొక్క అసహనాన్ని, రాజ్యాంగబద్ధ పౌరస్వేచ్ఛలను కాల రాయటాన్ని, నిరాయుధులైన ప్రజలపై గర్హనీయ స్థాయిలో ప్రయోగిస్తున్న అణచివేతను తెలియ జేస్తోందన్నారు. శ్రీలంక మానవ హక్కుల కమీషన్ కూడా ఈ పరిస్థితిలో జోక్యం చేసుకుంది.

దశాబ్దాలుగా శ్రీలంక పాలకులు ఎల్‌టిటిఇ బూచిని చూపెట్టి, ఒక సెక్షన్ ప్రజలపై క్రూరమైన దాడులకు పాల్పడటమేకాకుండా మొత్తంగా శ్రీలంక ప్రజల న్యాయమైన పోరాటాలను, ప్రజాస్వామిక హక్కులను హరించివేసే వ్యవస్థను, పరిస్థితులను సృష్టించుకోవటాన్ని సమర్థించబూనుకొంటున్నారు. 'ఉగ్రవాదం', 'వేర్పాటువాదం', 'దేశ అంతర్గత భద్రతకు, జాతీయ ప్రయోజనాలకు ముప్పు' వంటి సాకులతో ప్రజల జీవితాలపై, హక్కులపై దాడులను మరింత తీవ్రం చేస్తున్నారు. సింహళ జాతీయ దురహంకారాన్ని, మత దురహంకారాన్ని వివక్షను, జాతి, మత మైనారిటీలపై దాడులను ఒక వైపున ప్రోత్సహిస్తూ, మరోవైపు వాటిని కారణాలుగా చూపించి నిర్బంధ, అణచివేత ఆయుధాలకు పదును బెడుతున్నారు. శ్రీలంకలోని విశాల ప్రాంతాలలో ప్రజానీకం, వాస్తవానికి పోలీసు నిర్బంధం, సైనికుల నిరంతర నిఘాల నడుమ బ్రతుకులీడుస్తున్నారు.

కనుక, కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజలు, ఇతర పీడితులు – విభజించి పాలించే కుట్రకు, ప్రభుత్వ క్రూరనిర్బంధ విధానాలకు వ్యతిరేకంగా నిజమైన అర్థంలో ప్రజాస్వామిక, స్వతంత్ర శ్రీలంక కోసం పోరాడాలి. ఆనాడే శ్రీలంకలోని ప్రజలంతా ప్రజాస్వామిక, జాతీయ హక్కులను సమానంగా అనుభవించగలుగుతారు. ఫ్యూడల్, సామ్రాజ్యవాద దోపిడీ నుండి విముక్తమై శాంతియుత జీవనాన్ని పొందగలుగుతారు. ✡

# ఛత్తీస్‌ఘడ్ — ఆదివాసీ బాలికలపై అత్యాచారాలు

ఆదివాసుల పట్ల పాలకులు, ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే దానికి ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇటీవల జరిగిన సంఘటనలు అద్దం పడుతున్నాయి. ఆదివాసీ బాలికలపై పాలక రాజకీయ నాయకుల అండదండలతో జరుగుతోన్న దారుణాలు ఒడలు గగుర్పొడిచేవిగా వున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌రాష్ట్రం–కాంకెర్ జిల్లాలోని 'ఝులియమారి కన్యాశ్రమ్' అనే వసతి గృహం ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. 12 సం॥ల లోపు గిరిజన బాలికలు ఈ వసతి గృహంలో వుంటూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ వసతి గృహంలో నివసించే ఒక బాలిక ఇటీవల హటాత్తుగా మరణించడంతో ఒక్కటొక్కటిగా అక్కడ జరిగే ఘోరాలు వెలుగులోకి వచ్చాయి. ఆ బాలిక గర్భవతిగా వుండి, తత్సంబంధమైన అనారోగ్య కారణాలతో మృతి చెందిందని ఆ బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు చెబుతోండగా, ఆ వసతి గృహం అధికారులు మాత్రం తీవ్రమైన కామెర్ల వ్యాధికి గురై మరణించిందని – ఇలాంటి కారణంతో మరణిస్తే తమ బాధ్యతేమీ లేదన్నట్లుగా – తప్పుడు ప్రకటనలు చేసి చేతులు దులుపుకోజూశారు. ఒక టీవీ ఛానెల్ ఈ వార్తలను ప్రసారం చేయడంతో ప్రజాస్వామికవాదుల, వివిధ ప్రజాసంఘాల తీవ్ర నిరసనల తదనంతరం రమణ్‌సింగ్ నేతృత్వంలోని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం ఈ ఘటనలపై యధాప్రకారం ఓ న్యాయ విచారణకు ఆదేశించింది.

ఆ వసతి గృహంలోని బాలికలు తమపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాల గురించి విచారణ బృందానికి వివరించారు. 7–12సం॥ల మధ్య వున్న అనేకమందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 11 మంది బాలికలు అత్యాచారాలకు గురైనట్లు నిర్ధారించారు. మరే అండదండలు లేని పసివయసులోని నిరుపేద గిరిజన బాలికలనేకమందిపై వసతిగృహ అధికారులే లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు పాల్పడటంతో పాటుగా వారిని వేశ్యాగృహాల పాల్జేశారనే బాధిత విద్యార్థుల కథనం హృదయాలను కదిలించి వేసేదిగా వుంది. వెలుగులోకి వచ్చిన సంఘటన ఇది కాగా, మారుమూల ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ 'రక్షణ'లో వెలుగుజూడని దారుణాలింకెన్ని వున్నాయో?!

కేంద్ర గిరిజన సంక్షేమ శాఖామంత్రి సి.కె. డియో మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం వసతి గృహ బాలికలపై అత్యాచారాలకు, వేధింపులకు పాల్పడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ఉద్బోధిస్తూనే, దీని వెనుక పెద్దల హస్తాలు ఉండవచ్చునని పేర్కొన్నారు. పాలక రాజకీయ నాయకుల, ఉన్నతాధికారుల, పోలీసు అధికారులతోడ్పాటు, అండదండలతో ఈలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనేది ముమ్మాటికీ వాస్తవం.

గిరిజనులకు రిజర్వేషన్లు లేదా కొన్ని సంక్షేమ పథకాలు ప్రకటించటంతోనే వారి అభివృద్ధి 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా పరిఢవిల్లుతోందని పాలక ప్రభుత్వాలు గప్పాలు కొట్టుకోవడం మినహా, గత ఆరున్నర దశాబ్దాలుగా 'స్వతంత్ర' పాలనలో ఆదివాసులకు గౌరవప్రదమైన హుందాతోకూడిన జీవితాన్ని అందించ లేకపోయారు. వసతిగృహ బాలికలపై అత్యాచారం ఉదంతం వెలుగుజూసిన తర్వాత న్యాయ విచారణ అనంతరం కొందరిపై కేసు నమోదు, అరెస్టుల వంటి తతంగం నడిచినప్పటికీ, దీని వెనుక వున్న సూత్రధారులను బయటకు లాగి శిక్షింపజేసేందుకు బలమైన ఉద్యమాలు సాగాల్సివుంది. ✡

# మధ్యప్రదేశ్ — గిరిజన యువతులకు 'కన్యత్వ పరీక్షలు'

**బిజెపి** నాయకత్వంలోని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 'ముఖ్యమంత్రి కన్యాదాన్ యోజన' పేరిట ఆర్భాటంగా ఓ పథకాన్ని అమలుచేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. గిరిజనులలో పెండ్లిఖర్చులను తగ్గించేందుకు, ఆ సందర్భంగా అప్పులపాలు గాకుండేందుకు సామూహిక గిరిజన వివాహాలు జరిపిస్తున్నానని ప్రభుత్వం ప్రకటించుకుంది. ఈ పథకం ద్వారా దంపతులైన గిరిజనులకు మంచాలు, గ్యాస్‌స్టవ్‌లు, బీరువాలు, సైకిళ్ళతోపాటు మంగళ సూత్రాలను కూడా రాష్ట్రప్రభుత్వమే సమకూరుస్తుందని చెప్తోంది. వివాహ వయస్సు వచ్చిన ఏ గిరిజనయువతీ, యువకుడైనా ఈ పథకం ప్రకారం వివాహం చేసుకుంటే ప్రభుత్వమందించే లబ్ధిపొందవచ్చని పెద్దఎత్తున ప్రచారం సాగిస్తోంది.

2013 జూన్ రెండవ వారంలో భోపాల్‌కు 280 కి.మీ దూరంలోని బెతుల్‌జిల్లా, హోర్డోగ్రామంలో గోండు మరియు కోరుక తెగలకు చెందిన 350 మంది ఆదివాసీ యువతులు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ప్రయత్నించారు. కాగా, అధికారులు ఈ గిరిజన యువతులందరికీ చట్టవిరుద్ధంగా కన్యత్వ పరీక్షలు నిర్వహించి, వీరిలో 10మంది యువతులు గర్భవతులని తేల్చి, వారికి అందజేసిన మంచము, స్టవ్ తదితరాల న్నింటినీ వెనక్కు తీసుకొని, వారిని బయటకు పంపి ఘోరంగా అవమానించారు.

ఈ సంఘటన జరిగిన ఒక వారంరోజులలోనే, భోపాలుకు తూర్పుగా 470 కి.మీ. దూరంలోని దిందోరిస్ బజాగ్ బ్లాక్‌లోని మరికొంతమంది గిరిజన యువతులు ఈ పథకాన్ని వినియోగించుకోబోగా, వారికీ ఇదే పరాభవం ఎదురైంది. వారందరికీ కూడా కన్యత్వ పరీక్షలు నిర్వహించి ఐదుగురు యువతులను గర్భవతులుగా తేల్చి, సామూహిక వివాహ పథకం నుండి వారిని బయటకు పంపారు.

ఆ రాష్ట్ర సామాజిక న్యాయశాఖామంత్రి గోపాల్ భార్గవ, గిరిజన యువతులు గర్భవతులుగావున్న ఈ సంఘటనలను "లజ్జాకరమైనవి, గర్హనీయమైనవి"గా పేర్కొన్నాడు. భవిష్యత్తులో తమశాఖ సంబంధిత యువతుల తల్లిదండ్రులచే వారి కుమార్తె కన్యేనని పేర్కొంటూ ధృవీకరణ పత్రంపై సంతకాలు చేయించు కుంటామని నిస్సిగ్గుగా ప్రకటించే సాహసం చేశాడు.

గత 3 సంవత్సరాలుగా కన్యత్వ పరీక్షలు నిర్వహించే ఈ విధానం కొనసాగుతోందనేది స్పష్టం. కానీ జిల్లా ప్రభుత్వ అధికారులు కన్యత్వ పరీక్షలు నిర్వహించటం గురించి తమకు తెలియదనీ, ఇది ఆశ్చర్యం కలిగిస్తోందని ప్రకటించారు. ఈ పద్ధతికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనలపై విచారణకు ఆదేశిస్తున్నానని సంబంధిత జిల్లా కలెక్టర్ ఆర్‌పి మిశ్రా ప్రకటించాడు.

గిరిజనుల వివాహ ఆచార, సంప్రదాయాల ప్రకారం, వారికి కాబోయే అల్లుడు వారి ఇంట్లో రెండు సంవత్సరాలపాటు కలిసిమెలిసి వుండాల్సివుంటుంది. సాధారణ వివాహ తంతుకు ముందుగా కలిసి జీవించటం వారి సాంప్రదాయం ప్రకారం అభ్యంతరకరం కాదు.

కానీ, బిజెపి పాలకులు, గిరిజనుల ఆచార సాంప్రదాయాలను గుర్తించి, గౌరవించేందుకు సిద్ధంగా లేకపోగా, తమ హిందూత్వ సాంప్రదాయాలను వారిపై రుద్ది, వారిని అవమానించేందుకు పూనుకున్నారు. ఇది ఆదివాసీలపట్ల అమానవీయంగా ప్రవర్తించటం మినహా వేరుకాదు. ✡


**రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)**
**వార్షిక సంచిక - 2012**
వెల : రు. 50/-
కాపీలకు :
**మైత్రీబుక్‌హౌస్**
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2



# జాతీయ భూసంస్కరణల విధాన ముసాయిదా సంస్కరణలు అంటే అర్ధమేమిటి?

**2013** జులై 18న జాతీయ భూసంస్కరణల విధాన ముసాయిదా పత్రాన్ని కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. శాశ్వత జీవనోపాధిని కల్పించి, సామాజిక సమానత్వాన్ని సాధించటంకోసం గ్రామీణ పేదలకు భూమిని పంపకం చెయ్యటాన్ని లక్ష్యంగా ప్రకటించుకుంది. ఇంతేకాక ఇటీవలి సంవత్సరాలలో భూమి వినియోగం రూపొందుతున్న నూతన తీరు తెచ్చిన సమస్యల దృష్ట్యా కూడా గతంలో ఏనాటికన్నా భూసంస్కరణలు నేడు ఎక్కువ ప్రాసంగికతను కలిగివున్నాయని కూడా ఈ విధానంలో చెప్పుకుంది. 1980 దశకం మధ్య నుండి రాజకీయ చర్చలలోనూ, విధాన ప్రకటనల్లోనూ కన్పించకుండా పోయిన–వాటి స్థానంలోకి వేతనాలు చెల్లించే ఉపాధి పథకాలూ, ఆ తర్వాత సూక్ష్మరుణాలు వచ్చిన–భూసంస్కరణలు ఈనాడు హఠాత్తుగా ప్రత్యక్షమవటం చాలామందికి ఆశ్చర్యం కలిగించవచ్చును. అయితే యుపిఏ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం రాబోయే సాధారణ ఎన్నికలలో నినాదంగా రూపొందించే ప్రయత్న ఫలితమే ఇది. ఇటీవలి కాల భూమి వినియోగతీరుతో వీటిని కలిపి భూసంస్కరణలు అన్న పదానికి కొత్త అర్థాన్నిచ్చే ప్రయత్నం కూడా చేసింది. కనుకనే ఈ ముసాయిదాను లోతుగా పరిశీలించాల్సిన అవసరముంది.

నూతన భూమి వినియోగతీరు అంటే పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు తదితర వ్యవసాయేతర అవసరాలకు ఇటీవలి కాలంలో భూమి కేటాయింపులు పెరగటమని ప్రభుత్వం అర్థం. లోక్‌సభ, రాజ్యసభలు సవరించిన భూసేకరణ చట్టాన్ని ఆమోదించినందున, ఈ ముసాయిదాను వాటితో కలిపి పరిశీలించాల్సి వుంటుంది.

అధికారమార్పిడి జరిగిన తర్వాత మూడు దశాబ్దాల పాటు భూసంస్కరణలు ప్రభుత్వ కార్యకలాపాల్లో ప్రముఖస్థానంలో వుంటూ వచ్చింది. జమీందారీల రద్దు, ఆ తర్వాత రాజభరణాల రద్దు చట్టబద్ధంగా సాగించినా, స్వంత సేద్యం పేరిట విశాల భూఖండాలను కలిగివుండే అవకాశాన్ని సంస్థానాధీశులకూ, జమీందారులకు కల్పించారు. ఈ సంస్కరణలో భాగంగానే కౌలుదారులకు రక్షణ చట్టాలను చేశారు. అయినా కౌలుదారులను గుర్తించే చర్యలు తీసుకోకుండా మూజువాణిగా కౌలుదారీ పద్ధతిని కొనసాగనిచ్చారు. ఆ తర్వాత భూగరిష్ట పరిమితి చట్టాలను తెచ్చారు. అయినా తప్పించుకునేందుకు అనేక మార్గాలు చూపి, మిగులు భూములను తేల్చకుండా, తేల్చినా పంచకుండా, పంచినా లబ్ధిదారులకు స్వాధీన పరచకుండా కాలయాపన చేశారు. వీటితో పాటే షెడ్యూల్డు ప్రాంతాల్లో ఆదివాసుల భూములు పరాయీకరణ కాకుండా నిరోధించేందుకు బ్రిటిషు పాలకులు చేసిన చట్టాలను మళ్లీ చట్టాలుగా చేశారు. అయినా వీటిని అమలు జరపటంకంటే ఉల్లంఘనలే సాధారణ అంశంగా చేశారు.

వీటి అమలు ఎలా వున్నా, భూసంస్కరణలు అంటే కొద్ది కుటుంబాల చేతిలోనే అధికశాతం భూమి కేంద్రీకరించబడకుండా చూడటం, ఒక కుటుంబం కలిగివుండాల్సిన భూమికి పరిమితి విధించటం, తద్వారా లభ్యమైన భూమిని గ్రామీణ పేదలకు పంచటమని ప్రభుత్వం అంగీకరించింది. కాగా ప్రస్తుత ముసాయిదాలో భూమి పంపకం లక్ష్యమంటూనే పంపకానికి ముందుగా భూమి నిల్వ(పూల్) నిర్ధారించి, భూవినియోగ విధానాన్ని రూపొందించాలని పేర్కొనటం ద్వారా సంస్కరణ అన్న పదానికి కొత్త అర్థాన్నిచ్చింది. అభివృద్ధి అనబడే వ్యవసాయేతర అవసరాలకు భూమి కేటాయింపులను కూడా సంస్కరణల్లో చేర్చింది.

## భూ కేంద్రీకరణ

భూసంస్కరణ చట్టాల అమలు, భూమి కేంద్రీకరణ గూర్చి అనేక అధ్యయనాలు అందుబాటులో వున్నా, ముసాయిదాలో పేర్కొన్న గణాంకాలనే ఇక్కడ పేర్కొంటున్నాము.

**కుటుంబాలు కలిగివున్న భూమి**

| కుటుంబ భూమి | కుటుంబాల శాతం | కలిగివున్న భూమిశాతం |
|---|---|---|
| భూమిహీనులు | 31.12 | 0 |
| 0.4 హె.తక్కువ | 29.82 | 5.11 |
| 0.4 నుండి 1 హె | 18.97 | 16.89 |
| 1 నుండి 2 హె | 10.68 | 20.47 |
| 2 నుండి 3 హె | 4.22 | 13.94 |
| 3 నుండి 5 హె | 3.06 | 16.59 |
| 5 నుండి 10 హె | 1.6 | 15.21 |
| 10 హె.పైన | 0.52 | 11.77 |

ఆధారం: ఎన్.ఎస్.ఎస్.ఓ.2003-04 (ముసాయిదాలో పేర్కొన్నది)

గ్రామీణ కుటుంబాల్లో దాదాపు మూడవవంతుకు భూమిలేదు. మరో మూడవవంతు కుటుంబాలకు 60 సెంట్లకంటే తక్కువ భూమి వుంది. రెండవవైపున 10శాతం కుటుంబాలకు 50శాతం భూమి వుంది. ఇక్కడ పేర్కొన్న నేషనల్ సాంపుల్ సర్వే ప్రకారమే 41శాతం కుటుంబాలకు పెరడుతప్ప భూమిలేదు. ఇంతేకాదు షెడ్యూల్డు తెగలు, కులాలలో భూమి హీనత పెరిగి పోతున్నది. మరో మాటల్లో చెప్పాలంటే 60శాతం గ్రామీణ కుటుంబాలకు 5 శాతం భూమి మాత్రమే వుంది. మరో 20 శాతం కుటుంబాలకు ఒక హెక్టారులోపు భూమి మాత్రమే వుంది.

భూరికార్డులలోని అపసవ్యతలనూ, గరిష్టపరిమితి నుండి తప్పించుకునేందుకు అనుసరించిన పద్ధతులనూ దృష్టిలో వుంచుకుంటే, భూమి కేంద్రీకరణ ఎంత ఎక్కువస్థాయిలో వాస్తవంగా వుంటుందో అర్థమౌతుంది.

## చట్టాల అమలు

భూమి రాష్ట్రాల అధికారాల పరిధిలో వుంది. కనుక భూసంస్కరణ చట్టాలు చేయటం, వాటిని అమలు చేయటం పూర్తిగా రాష్ట్రప్రభుత్వాల బాధ్యత. భూసంస్కరణల పనితీరు ఎలా వుందో చూద్దాం.

2005 చివరి నాటికి అన్ని రాష్ట్రప్రభుత్వాలూ కలిసి 73.4 లక్షల ఎకరాలను (మొత్తం వ్యవసాయ భూమిలో ఇది 1.8 శాతం) మిగులు భూమిగా ప్రకటించాయి. దీనిలో 65 లక్షల ఎకరాలను రాష్ట్రప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్నాయి. దీనిలో 53.9 లక్షల ఎకరాలను 56.4 లక్షల కుటుంబాలకు పంచాయి. అంటే దాదాపు 1 శాతం భూమిని 4 శాతం గ్రామీణ కుటుంబాలకు పంచాయి. లబ్ధిదారుల్లో అత్యధికభాగం కేరళ, పశ్చిమబెంగాలు, జమ్ముకాశ్మీరు, అస్సాం రాష్ట్రాలలోనే వున్నారు.

> ఈ విషచక్రాన్ని బ్రద్దలుకొట్టడానికి వున్న ఒకే విధానం దున్నేవానికే భూమి ప్రాతిపదికన భూమి పంపకాన్ని చేపట్టి పూర్తిచేయటం. దీనివల్ల గ్రామసీమలలో వచ్చే పెనుమార్పుల విప్లవతత్వం పాలకవర్గాలను భీతిల్లచేస్తున్నది. అందువల్లనే ముసాయిదాలో చెప్పినట్లు ప్రజలలో పెరుగుతున్న "సామాజిక అశాంతి, హింసల"ను చల్లార్చే చర్యలతో సరిపెట్టజూస్తున్నారు.

ఇక భూదాన ఉద్యమంలో సమకూరిన భూములను పంచకుండా వుండి వుంటే, రాష్ట్రాలు వాటిని పంచేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముసాయిదా పత్రం చెప్పింది. అయితే అసలు భూదాన ఉద్యమ భూముల వివరాలు యివ్వలేదు. పోతే ప్రభుత్వ బంజర్లు. ఇవి 633 లక్షల హెక్టార్లని అంచనా. దీనిలో సాగుకు లాయకైనది 325 లక్షల ఎకరాలు. దీనిలో 147 లక్షల ఎకరాలను గ్రామీణ పేదలకు పంచారు. ఈ లెక్కలు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖవి. కాగా ప్రభుత్వ బంజర్లు ఎంత వున్నాయో, అవి వ్యవసాయేతరంగా ఉపాధినెలా యివ్వగలవో రాష్ట్రాలు గుర్తించాలని ముసాయిదా పేర్కొంది. అంటే ఇకముందు ప్రభుత్వ బంజర్లను పేదలకు యివ్వరు. వ్యవసాయేతర అవసరాలకు కేటాయిస్తారు.

ఇక దేవాలయ భూములు. ఇవి అన్యాక్రాంత మయ్యాయనీ, సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా రాష్ట్రాలు అమలుచేయటం లేదని పేర్కొన్న ముసాయిదా వీటిని గ్రామీణ పేదలకు లీజుకిమ్మని మళ్లీ సలహా యిచ్చింది.

షెడ్యూల్డు ప్రాంతాల్లో ఆదివాసుల భూములు అన్యాక్రాంతమౌతున్నాయని అంగీకరించిన ముసాయిదా, అలా అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అన్యాక్రాంతమైన భూముల వివరాలు యివ్వలేదుగానీ మరోలెక్కను ముసాయిదా యిచ్చింది. 8.55 లక్షల ఎకరాల షెడ్యూల్డు ప్రాంత భూములపై 3.75 లక్షల కేసులు రిజిస్టరుకాగా, 4.47 లక్షల ఎకరాలకు చెందిన 1.62 లక్షల కేసులలో ఆదివాసులకు అనుకూలంగా కోర్టులు తీర్పులిచ్చాయి. 3.63 లక్షల ఎకరాలకు చెందిన 1.54 లక్షల కేసుల్లో ఆదివాసులకు వ్యతిరేకంగా తీర్పులిచ్చాయి. ఇదంతా న్యాయస్థానాలకు చేరిన లెక్క. దీనికి ఎన్నోరెట్లు ఎక్కువగా ఆదివాసీ భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇవన్నీ 'పెసా' చట్టం రాకముందు సంగతి.

పెసా చట్టం ప్రకారం ఆదివాసీ భూమి అన్యాక్రాంతం కాకుండా చూసే అధికారం గ్రామసభది. ఈ చట్టంవచ్చి(1996)17 ఏళ్లు గడచినప్పటికీ, భూముల అన్యాక్రాంతాన్ని నివారించే గ్రామసభల అధికారాన్ని వినియోగించుకునేందుకు రూపొందించాల్సిన విధి విధానాలను ఇంతవరకూ ఒక్క రాష్ట్రప్రభుత్వమూ రూపొందించి, గెజెట్‌లో ప్రచురించలేదు. గ్రామసభల హక్కు కాగితాలకే పరిమితమైంది. ఆదివాసీ భూముల పరాయీకరణ నిరాటంకంగా సాగిపోతున్నది.

భూసంస్కరణల్లో ముఖ్యమైన కౌలుదారులకు రక్షణ గురించి ముసాయిదా ఒక్కమాటకూడా చెప్పలేదు. కాగా కాగితాలమీద ఇది విజయవంతమైనట్లుగా కన్పిస్తుంది. కౌలుదారీ రక్షణ చట్టాల తర్వాత 2000 నాటికి 124 లక్షల కౌలుదారులకు 156 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించినట్లు చెప్పుకున్నారు. వీరు గ్రామీణ కుటుంబాలలో 5 శాతం మాత్రమే. ఇది కూడా రెండు మూడు రాష్ట్రాల్లోనే జరిగింది. నూతన ఆర్థిక విధానాలతో కౌలుదారుల సంఖ్య పెరిగిందని అనేక అనధికార అధ్యయనాలు తెలుపుతుండగా, కౌలుదారుల సాగుక్రింద 60శాతం వరకూ భూమి వుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంచనావేసింది. వీరంతా కౌలుదారులుగా గుర్తింపులేని వారే. ఎలాంటి రక్షణలూ లేనివారే.

## ఇది వైఫల్యమేనా?

భారత దేశంలో భూమిపంపకంతోకూడిన భూసంస్కరణల స్థూలచరిత్ర యిది. ఇది వైఫల్యాల తోరణం. అయితే ఇది నిజమైన అర్థంలో వైఫల్యమేనా?

వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పరాకాష్టకు చేరిన భారత రైతాంగ భూపోరాటాలు భూస్వామ్య వ్యవస్థను కుదిపివేసి విప్లవదిశగా పయనించటం భారత దోపిడీ పాలకవర్గాలకు భీతిని కల్గించాయి. రైతాంగ పోరాటాలను నిర్దాక్షిణ్యంగా రక్తపుటేరుల్లో ముంచుతూనే, రైతాంగంలో భ్రమలు కల్గించేందుకు భూసంస్కరణల నినాదంతో ముందుకు వచ్చారు. భారతదేశ ఏకీకృత పాలనకు ఆటంకంగా వున్న జమీందారీ వ్యవస్థను రద్దుపరిచారు. అయితే జమీందారుల భూమిని తాకలేదు. రైతాంగం పోరాడి సాధించుకున్న భూములకు ఆ తర్వాతెప్పుడో, వారిని భూమినుండి తొలగించలేకపోయిన తర్వాత, పట్టాలిచ్చారు. ఇంతకుమించి వారు భూమిని పంచిందిలేదు. 1960ల చివరిలో శ్రీకాకుళం, నక్సల్బరీ తదితర రైతాంగ పోరాటాలు వెల్లువెత్తడంతో మళ్లీ ఇదేనాటకాన్ని పునరావృతం చేశారు. పాత చట్టాలను సవరణలతో పటిష్టంచేశామని భ్రమలు కల్పించేందుకు పూనుకున్నారు. ఆ తర్వాత వాటిని అటకెక్కించారు. దీనికి ప్రతిగా దారిద్ర్య నిర్మూలన పేరిట వేతన చెల్లింపు పథకాలు తెచ్చారు. గ్రామీణ పేదలను నిరంతరం సహాయం కోసం ఎదురుచూసే స్థితిలోనే వుంచారుతప్ప దారిద్ర్యాన్ని రూపుమాపలేదు. ఈ కాలమంతటా భూమి పంపకంతో ఫ్యూడలు వ్యవస్థను రద్దుచెయ్యాలని పాలకవర్గాలు కోరుకోలేదు. సొసైటీల పేరిట ఆర్థికంగానూ, పంచాయతీరాజ్ పేరిట రాజకీయంగానూ వారి ప్రాబల్యాన్ని పెంచి, అతినెమ్మదిగా వారిని పెట్టుబడిదారీ భూస్వాములుగా మార్చేందుకు దిగుబడులు పెంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని (పైరుపచ్చ విప్లవం) వాడారు.

కనుక భారత పాలకవర్గాలు కోరుకుని అమలు జరపాలని పూనుకుని విఫలమైన సంస్కరణలుకావివి. రైతాంగ పోరాటాలనుండి భూస్వామ్య వర్గాలను కాపాడి, అర్థవలస–అర్ధభూస్వామ్య వ్యవస్థ కూలిపోకుండా నిలిపేందుకు తప్పని సరై తీసుకున్న చర్య యిది. పాశవిక నిర్బంధంతోనూ, భ్రమలతోనూ రైతాంగ పోరాటాలను వెనుకపట్టు పట్టించిన తర్వాత అలంకారప్రాయంగా మిగల్చదలచిన, మిగిల్చిన చర్యలివి.

> సంస్కరణ అన్న దానినే 'ముసాయిదా' సమీక్షించింది. ప్రభుత్వ బలవంతపు భూసేకరణకు అడ్డుతగిలే హక్కులన్నింటినీ పరోక్షంగా రద్దుచేసేందుకు సంస్కరణలు అన్న పదానికి అర్థాన్ని విస్తరించింది. గ్రామసభలకు (ప్రజలకు) ఉన్న హక్కులను గౌరవిస్తానంటూనే వాటిని కుదించేందుకు పూనుకుంది.

## ఆంధ్రప్రదేశ్‌లో అమలు ప్రహసనం

దేశవ్యాపితంగా ప్రజ్వరిల్లిన రైతాంగ, వ్యవసాయ కూలీ పోరాటాలకు బెంబేలుపడిన దోపిడీ పాలకులు, వాటిపై క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ఆ పోరాటాలను ప్రక్కదారి పట్టించేందుకు భూములు పంచుతామని ప్రకటించారు. మొదటి పంచవర్ష ప్రణాళికలో భూస్వాముల భూములకు గరిష్ట పరిమితి విధిస్తామని ప్రకటించారు. భూముల పరిమితి ఎంత అని చెప్పటానికే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదు సంవత్సరాలు పట్టింది. మూడు కుటుంబాల కమతం పరిమితిగా చెప్పింది. అది వ్యక్తా, కుటుంబమా అనేది రాష్ట్రాలకు వదిలివేసింది. భూస్వామ్యవర్గానికి ప్రాతినిధ్యం వహించేవారు పార్లమెంటులో అత్యధికంగా వుండటం వలన వారి ప్రయోజనాలు దెబ్బతినకుండా భూపరిమితి ఎక్కువగా విధించారు. చట్టం గురించి ముందే తెలియటంతో భూస్వామ్యవర్గం జాగ్రత్తపడ్డారు. ప్రభుత్వం విధించిన భూపరిమితి ఎడల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తంకావటంతో 1954లో దాన్ని సవరించారు. సవరించిన చట్టప్రకారం ఒక్కో కుటుంబానికి 108 ఎకరాలు మాగాణి, 162 నుండి 324 ఎకరాల వరకు మెట్ట భూమిని భూపరిమితిగా విధించారు. భూపరిమితి చాలా ఎక్కువగా వుండటంవలన, భూస్వాములు జాగ్రత్త పడటంవలన సవరించిన చట్టంద్వారా కూడా పేదలకు భూములు దక్కిందేమీలేదు.

> భూసేకరణ ప్రజాప్రయోజనం కోసమేనా అన్న అంశం ప్రశ్నించరానిది. అది ప్రభుత్వ నిర్ణయం. వ్యవసాయేతర భూమిగా తాను గుర్తించిన భూమినీ, ప్రభుత్వ భూమినీ ప్రభుత్వం పరిశ్రమలు తదితరాలకు కేటాయిస్తుంది. వ్యవసాయేతర భూమిగా గుర్తించిన దానిలో ప్రైవేటు భూమివున్నా అది సేకరిస్తుంది. సారవంత వ్యవసాయ భూములను సేకరిస్తున్నారన్న విమర్శలకు ఇక అడిగే హక్కులేకుండా ముందే వ్యవసాయ భూమి కాదని వర్గీకరిస్తుంది.

1954లో సవరించిన భూసంస్కరణల చట్టంయొక్క నిరుపయోగతను ఎండగడుతూ కమ్యూనిస్టుపార్టీ భూపోరాటాలకు పేదలను సన్నద్ధంచేస్తూ, పోరాటాలు నడుపుతున్న నేపథ్యంలో భూగరిష్టపరిమితిని తగ్గిస్తూ 1958లో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టింది. దాన్ని 1961లో చట్టంగా మార్చింది. ఈ చట్టంలోని లొసుగులను ఉపయోగించి బినామి పేర్లతోనూ మరియు భార్యాబిడ్డలు విడిపోయినట్లు కాగితాలు వ్రాసుకొని చట్టంనుండి తప్పించుకొన్నారు. పేదలకు మాత్రం భూమి దక్కలేదు. భూమిపై భూస్వాముల ఆధిపత్యం కొనసాగింది.

కాంగ్రెస్ ప్రభుత్వంయొక్క భూస్వామ్య అనుకూల విధానాలను, దాని బూటకపు భూసంస్కరణలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుపార్టీ, వ్యవసాయ కూలీసంఘాలు పేదలను సంఘటితపర్చి వేలాది ఎకరాల బంజరు భూములను ఆక్రమించారు. భూస్వాముల దాడులు, దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు.

ఇలాంటి పోరాటాల నేపథ్యంలో 1956 నుండి శ్రీకాకుళంజిల్లాలో గిరిజనోద్యమానికి కమ్యూనిస్టు పార్టీ సన్నాహాలు ప్రారంభించింది. భూస్వాముల, వడ్డీ వ్యాపారుల దోపిడీ, దౌర్జన్యాలకు, ఫారెస్టు–పోలీసు అధికారుల దురాగతాలకు వ్యతిరేకంగా గిరిజనులను గిరిజన సంఘంలోకి సమీకరించింది. అన్యాక్రాంతమైన వారిభూముల పునరాక్రమణకు పూనుకొన్నారు. ఉద్యమం వేలాదిమంది గిరిజనులతో ఉధృతరూపం దాల్చింది. ప్రభుత్వం అమలుజరిపిన క్రూరనిర్బంధంవలన శ్రీకాకుళం గిరిజనోద్యమం తాత్కాలికంగా అణచి వేయబడ్డా, తెలంగాణ పోరాటం జరిగిన 17 సంవత్సరాల తర్వాత మరొకసారి భూమి సమస్యనూ, ఆదివాసీల సమస్యనూ ఈ ఉద్యమం ముందుకు తెచ్చింది.

శ్రీకాకుళ గిరిజనోద్యమం ఫలితంగా పాలకులకు కొన్ని చట్టాలు చేయకతప్పలేదు. 1/70 చట్టం ఈ పోరాట ఫలితంగా వచ్చిందే. శ్రీకాకుళ గిరిజనోద్యమంలాంటి పోరాటాలు దేశంలోను, రాష్ట్రంలోనూ బ్రద్దలయ్యే పరిస్థితులను గమనించిన పాలకులు, ఆ పోరాటాలను దారిమళ్లించేందుకు 1971లో భూసంస్కరణల చట్టం చేశారు. ఆంధ్రరాష్ట్రంలో 1972 మే 2న భూపరిధిని కుదిస్తూ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చారు. 1973లో రాష్ట్ర శాసనసభలో ఈ ఆర్డినెన్స్ చట్టంగా ఆమోదించ బడినప్పటికీ 1975 జనవరి 1 వరకు అమలు జరగలేదు. ఈ కొత్త చట్టంలో 18 ఎకరాలు మాగాణి, 37 ఎకరాలు మెట్ట భూములను; కొన్ని ప్రాంతాల్లో 27 ఎకరాలు మాగాణి, 54 ఎకరాల మెట్ట భూములను గరిష్ట పరిమితిగా పేర్కొన్నారు. చట్టం రూపురేఖలు ముందుగానే తెలియటంతో వివిధ రూపాల్లో భూస్వాములు చట్టపరిధిలోకి రాకుండా భూములు కాపాడుకున్నారు.

ఈ భూపరిమితి చట్టంద్వారా 18 లక్షల ఎకరాలకు పైగా మిగులు భూములు వున్నట్లు మొదట ప్రభుత్వం ప్రకటించింది. అనేక దఫాలుగా భూములను కుదించి చివరకు మిగులు భూములను 7.9 లక్షల ఎకరాలుగా ప్రకటించింది. ఇందులో 6.17 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకొని, 4.79 లక్షలమందికి 5.82 లక్షల ఎకరాలను పంపిణీచేసినట్లు ప్రకటించింది. పంపిణీ చేసిన భూముల్లో భూస్వాములనుండి స్వాధీనం చేసుకొన్న భూమి మూడంకెలలోపే వుంది. పేదలు అప్పటికే సాగుచేసుకొంటున్న భూములకు పట్టాలు యిచ్చి భూపంపిణీ చేసినట్లు ప్రచారం చేసుకొన్నారు.

భూసంస్కరణల కమీషన్ యిచ్చిన లెక్కల ప్రకారం భూపంపకం జరిగిన తీరు ఈ విధంగా వుంది.

| మిగులు భూమి | మాగాణి | మెట్ట |
|---|---|---|
| మిగులు భూమి అంచనా | 92,186 | 9,31,112 |
| స్వాధీనం చేసుకొన్న భూమి | 24,541 | 3,66,744 |
| వ్యవసాయానికి పనికిరాని భూమి | 42,490 | 88,393 |
| ఇంకా పంపకంకాని భూములు | 3,433 | 24,381 |
| అస్సైన్డ్ చేసిన భూములు | 18,371 | 2,61,002 |

**మిగులు భూములు పంచిన శాతం 27.03**

ఈ పట్టికను పరిశీలిస్తే మిగులు భూములు స్వాధీనం చేసుకొన్నది చాలా తక్కువకాగా అందులోనూ మాగాణి భూమి చాలా తక్కువగా వుంది. పంపిణీ చేసిందికూడా 27% మాత్రమే. దీన్ని గమనించినప్పుడు భూసంస్కరణల చట్టం అమలు చాలా లాంఛనప్రాయంగా జరిగిందని స్పష్టమౌతుంది.

1983 వరకు మాటల్లోనైనా భూపంపిణీ గురించి పాలకులు చెబుతుండేవారు. ఆ తర్వాత భూసంస్కరణల గురించి మాట్లాడటం మానుకొన్నారు. భూసంస్కరణల గురించి మాట్లాడేవారిని అపహాస్యం చేశారు. ప్రజల్లో భూకాంక్ష రగులుతూనే వుంది. అనేక ప్రాంతాల్లో వారు భూములు స్వాధీనం చేసుకొన్నారు.

అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌పార్టీ, దాన్ని తిరిగి తెచ్చుకునేందుకు అనేక వాగ్దానాలతోపాటు భూపంపిణీ చేస్తానని ప్రకటించింది. రాజశేఖరరెడ్డి పాదయాత్రలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే భూసంస్కరణలు అమలుజరుపుతానని ప్రకటించారు.

2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూపంపిణీకోసం, భూముల వివరాలకోసం కోనేరు రంగారావు అధ్యక్షతన భూకమీషన్‌ను రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నియమించింది. రంగారావు కమీషన్ అనేకమందితో చర్చించి, అభిప్రాయాలు సేకరించి 28-12-2006న తన నివేదికను ప్రభుత్వానికి అందచేసింది. 60 లక్షల ఎకరాలు సేద్యపు అనుకూల భూములు ఉన్నాయని వాటిని పేదలకు పంపిణీ చేయవచ్చని నివేదికలో పేర్కొంది. ఈ విధంగా భూమి సమస్య తిరిగి చర్చనీయాంశమైంది.

పేదలకు భూములు పంచటానికే భూకమీషన్ ఏర్పాటు అని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, కోనేరు రంగారావు కమీషన్ సిఫార్సుల అమలుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. అందుకు విరుద్ధంగా విడతల వారీ భూపంపిణీ అంటూ ప్రజలను వంచించేందుకు పూనుకొంది. గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆరువిడతల పంపిణీలో 8 లక్షల ఎకరాలకు పైగా పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నది. పంపిణీ చేశామని చెప్పుకొంటున్న భూముల్లో 90% దాకా ఎన్నో సంవత్సరాలనుండి పేదలు సాగుచేసుకొంటున్న భూములే వున్నాయి. వీటికి పట్టాలు యిచ్చి వాటిని భూపంపిణీ క్రింద లెక్కలు చూపారు. కొత్తగా కొద్దిపాటి భూములకు పట్టాలు యిచ్చినా, అవి ఉపయోగపడని రాళ్ళ రప్పల భూములుగానే వున్నాయి. పట్టాలు యిచ్చిన అనేక భూముల హద్దులు ఇంతవరకూ చూపెట్టలేదు. ఈ విషయాలు పత్రికల్లో రుజువులతో సహా ప్రచురించబడ్డాయి. ఈ విడతల భూపంపిణీ మాటల గారడీగా మారింది. భూస్వాముల భూములు ఒక్కఎకరం కూడా పేదలకు పంపిణీ జరగలేదు.

పేదలకు భూములు పంచుతున్నానని ప్రచారం చేసుకొంటున్న రాష్ట్రప్రభుత్వం ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. పేదలకు యిచ్చిన భూములనే గుంజుకొంటున్నది. 1952 నుండి భూస్వాముల స్వాధీనంలో వున్న బంజరు భూములతో సహా అన్ని రకాల బంజరు భూములను కమ్యూనిస్టుపార్టీ, వ్యవసాయకూలీ సంఘాల నాయకత్వాన పేదలు పెద్దఎత్తున భూములను ఆక్రమించుకొని సాగుచేసుకొన్నారు. భూస్వాముల దాడులను, ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి నిలబడ్డారు. భూములకు పట్టాలు ఇవ్వాలని ఉద్యమించారు. ఉద్యమ ఫలితంగా సాగుదార్లకు డి.ఫాం. పట్టాలను ప్రభుత్వం మంజూరుచేసింది. సేద్య పరికరాలు, సాగు ఖర్చులులేక కొందరు సేద్యం చేయలేకపోయారు. వారికి ప్రభుత్వంనుండి ఎటువంటి సహాయం అందలేదు. కొన్నిభూములు అన్యాక్రాంతమైనాయి. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించి, పేదల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కి అనుగుణంగా 1977లో 9/77 అసైన్డ్ చట్టాన్ని ప్రభుత్వం చేసింది. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలను ఈ చట్టం నిషేధించింది. భూములు కొన్నవారిని నేరస్తులుగా పేర్కొంది. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని లబ్ధిదారునికి ఇవ్వాలని, అది సాధ్యపడకపోతే అర్హుడైన మరో లబ్ధిదారునికి మాత్రమే ఇవ్వాలని చట్టం స్పష్టంచేసింది.

అసైన్డ్ చట్టం అమలులో వున్నప్పటికీ భూములు అన్యాక్రాంతమౌతున్నాయంటూ ప్రభుత్వమే వాటిని స్వాధీనం చేసుకోవటానికి అసైన్డ్ చట్టానికి సవరణలు చేసి శాసనసభలో ఆమోదం పొందింది. చట్టంలోని 4వ సెక్షన్, బి.క్లాజుని సవరణచేసి, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకొని పేదలకే ఇవ్వాలనే నిబంధనల నుండి మినహాయింపు పొంది, అమ్మే హక్కును, వాటిని తన ఇష్టమైన వారికి యిచ్చేహక్కును ప్రభుత్వం ఏర్పరచుకొంది. దీన్ని చట్టంలోని 1వ సెక్షన్, 2వ క్లాజ్ ప్రకారం అన్ని ప్రాంతాలకు వర్తింపచేసింది. అన్యాక్రాంత భూములను స్వాధీనం చేసుకోవటానికైతే చట్టాన్ని సవరించాల్సిన అవసరంలేదు. ఇదివరకు వున్న చట్టమే సరిపోతుంది. పేదల భూములను భూస్వాములకు, బడా పరిశ్రమదారులకు కట్టబెట్టేందుకే పేదలను భూములకు దూరంచేసేందుకే చట్టసవరణ జరిగిందనేది వాస్తవం. ఇప్పటికే సెజ్‌ల, కారిడార్‌ల పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకొని పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టింది. ఈ విధంగా 9/77 అసైన్డ్ చట్టాన్ని నీరుగార్చింది.

అధికారమార్పిడి జరిగిన దగ్గరనుండి పాలక వర్గాలు భూస్వాముల ప్రయోజనాలు కాపాడుతూ వస్తున్నారు. చట్టసభల్లోకూడా స్వతహాగా భూస్వాములు వున్నారు. వారి ప్రయోజనాలు దెబ్బతినకుండా భూసంస్కరణ చట్టాలను నీరుగార్చారు. పేదలకు భూములు పంచటమన్నది పాలకుల అభిమతం కాదు. అందుకే 66 సం॥ల 'స్వతంత్ర' పాలనలో పేదలకు భూములు దక్కలేదు. రూపం మారినా భూములు కొద్దిమంది చేతుల్లోనే అత్యధికంగా వున్నాయి.

## ముసాయిదా చెప్పిన "పరిష్కారం"

భూగరిష్టపరిమితి చట్టాల అమలులో వైఫల్యం గురించి ముసాయిదా మాట్లాడలేదు. దీనికి అది చెప్పిన పరిష్కారం యిలా వుంది.

"భూమిహీన పేదలకు అనుకూలంగా వుండేందుకు భూసంస్కరణలను నిజమైన స్ఫూర్తితో అమలుజరపటం ఈ విధాన లక్ష్యంగా వుంటుంది. ప్రతి గ్రామానికి భూమి వినియోగ ప్రణాళిక తయారీ; దీనితో ప్రతిమడి చెక్కనూ ఉత్కృష్ఠంగా వినియోగించటం; పేదలకు భూమి పంచేందుకు విధానాలూ, పద్ధతులూ ఏర్పాటుచెయ్యటం; వారు ఆ భూమి కోల్పోకుండా రక్షణ కల్పించటం; అన్యాక్రాంత భూములను తిరిగి అప్పగించటం; ఎస్.టి, ఎస్‌సిల భూములకు రక్షణ కల్పించటం; కౌలుదారుల హక్కులు, మహిళలకు భూమిహక్కు, ఉమ్మడి భూముల ఫలప్రద వినియోగం -దీనికి సాధనాలుగా వుంటాయి."

ఉన్నత లక్ష్యాలను ప్రకటించే ఉదాత్తపద బంధాలివి. ఈ ఉదాత్త పదాలు దాచిన వాస్తవమేమంటే ఇన్నాళ్లూ ఈ భూసంస్కరణలు అమలుకాకపోవటానికి అసలైన కారణాన్ని! ప్రజలను ఏమార్చడానికి చేసిన చట్టాలను అమలుజరిపే ఉద్దేశ్యమే పాలకవర్గాలకు లేదన్న నిజాన్ని! అందుకనే భూసంస్కరణలు అమలు జరగకపోవటానికి సాంకేతిక, పర్యవేక్షక విఫలతనే కారణంగా చూపెట్టింది.

ఇది మరింత స్పష్టంగా అర్థంకావాలంటే, దీని అమలు కొరకు ముసాయిదా చేసిన సూచనలు చూస్తే సులభమౌతుంది.

1. భూగరిష్ట పరిమితిని మాగాణికి 5-10 ఎకరాలకూ, మెట్టకు 10-15 ఎకరాలకు తగ్గిస్తూ అన్ని రాష్ట్రాలూ చట్టాలను సవరించాలి.
2. ప్లాంటేషన్లు, మతసంస్థలు, విద్యాసంస్థలు, సేవాసంస్థలు, పరిశ్రమలకు ఇచ్చిన మినహాయింపులను తొలగించాలి.
3. బినామీలను రద్దుచేయాలి.

ఈ సూచనలు చెప్పేదేమిటి? ఇప్పటి మిగులు భూమిలెక్కలు సరైనవే. పంపకానికి ఇంకా భూమి కావాలంటే గరిష్టపరిమితిని తగ్గించాలి. కొందరికిచ్చిన మినహాయింపులు రద్దుచేయాలి.

తాను పంపకం చేసిన భూమినే (అసైన్డ్ భూములు) తిరిగి తీసుకుని సెజ్‌లకు కట్టబెడుతున్న రాష్ట్రాలు, ఈ సూచనలను అమలుచేస్తాయని ఆశించటం అత్యాశే అవుతుంది. ముసాయిదా విడుదలై రెండు వారాలు కాకుండానే, రాష్ట్రం విభజన సమస్యతో అట్టుడికిపోతున్నా, ఈ సూచనలు అమలుజరపడం సాధ్యంకాదని ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ముసాయిదాపై తన అభిప్రాయాన్ని కేంద్రానికి తెలుపుతానందంటేనే; రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, టిడిపి, వైఎస్ఆర్‌సిపి, లోక్‌సత్తా పార్టీలు భూగరిష్టపరిమితిని తగ్గించరాదని తమ అభిప్రాయం చెప్పాయంటేనే, ఈ సూచనలు బుట్టదాఖలవుతాయని పసిపిల్లలకైనా అర్థమౌతుంది. సిపిఐ, సిపియంలు ముసాయిదా సూచన ప్రకారం భూగరిష్ట పరిమితిని తగ్గించాలని చెప్పాయి.

ఆదివాసీ భూములకు సంబంధించి, పెసాచట్టం ప్రకారం గ్రామసభలకు అధికారాన్ని దఖలు పరచాలని మరో సూచన. పెసా చట్టానికి ఇంతవరకూ విధి విధానాలనే రూపొందించని వాస్తవాన్ని సరిదిద్దటం గురించి మాట్లాడకుండా, కరణాలు తయారుచేసిన భూమి రికార్డులను పరిశీలించే సామర్థ్యాన్ని పంచాయితీలకు కల్పించేందుకు శిక్షణా కార్యక్రమం గురించి చెప్పటమంటే పంచాయితీలకు సమర్థత కొరవడటాన్ని కారణంగా చూపెట్టడమే.

ఇక ఎస్‌సిల భూములకు సంబంధించి ల్యాండు బ్యాంకుల ఏర్పాటును సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో దీని అమలును మిగిలిన రాష్ట్రాలు అధ్యయనంచేసి అమలుకు చర్యలు తీసుకోవాలట! మార్కెట్టులో భూమిని ప్రభుత్వం కొని(భూసేకరణ ద్వారాకాదు) స్వయంసహాయక బృందాలకు కౌలుకు యివ్వాలట! గ్రామంలో భూమిని అమ్ముతుంటే మొదట కొనే హక్కు లాండ్ బ్యాంకుకు వుండాలి. ఇతరుల నుండి భూమిని లాండ్‌బ్యాంకు కౌలుకు తీసుకోవచ్చు. ఇంతకీ దీనికి నిధులెక్కడనుండి వస్తాయి? అది స్పష్టంగా చెప్పలేదు. కాగా స్వయం సహాయక బృందాలు పొదుపు నిధిని వాడవచ్చు అన్నారు. స్వయం సహాయక బృందాలు భూమికొనగల పొదుపు చేయగలిగితే వారే కొనుక్కోగలరుగదా? నేటి ధరల ప్రకారం వారి పొదుపు డబ్బు రిజిస్ట్రేషన్ ఛార్జీలకే చాలదు. ఇక దేవాలయాల భూములకు సంబంధించి, సుప్రింకోర్టు తీర్పు ప్రకారం బహిరంగవేలంద్వారా కౌలుకివ్వాలని ముసాయిదా సూచించింది తప్ప సరసమైన కౌలురేటుకు పేదలకు యివ్వాలని చెప్పలేదు.

ఇవి తప్ప మిగిలిన సూచనలన్నీ పర్యవేక్షణా సాంకేతికపర సూచనలే. 36 పేజీల ముసాయిదాలో 25 పేజీలనిండా యివే. భూసంస్కరణ చట్టాల అమలులోని వైఫల్యాన్ని ముసాయిదా సాంకేతిక సమస్యగా చూసింది. ఏ రకపు భూమి సమస్య విషయంలోనూ అది అసలైన వర్గ రాజకీయ ఆర్థిక కారణాలను పేర్కొనలేదు.

## పొంచివున్న ప్రమాదం

గ్రామసభలనుండి ప్రతిపాదన వచ్చేవరకూ షెడ్యూల్డు ప్రాంతాల్లో గనుల తవ్వకం చేపట్టరాదనీ, పెసాచట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని ముసాయిదా చెప్పింది. తరువాతి వాక్యంలోనే షెడ్యూల్డు ప్రాంతాల్లో గనుల తవ్వకం అత్యావశ్యకమని పరిగణిస్తే (ఎవరు పరిగణిస్తే? ఈ ప్రశ్నకు సమాధానం లేదు) గ్రామసభ, ప్రభుత్వమూ కలిసి గనుల తవ్వకం చేపట్టాలి; గనినుండి వచ్చే రాయల్టీలో సగం గ్రామసభకు యివ్వాలి అని ముసాయిదా సన్నాయినొక్కు నొక్కింది. గనులు తవ్వాలన్న నిర్ణయం గ్రామసభదికాదు. రాయల్టీ ఎంత విధించాలన్న నిర్ణయం చేసేది గ్రామసభ అని చెప్పలేదు. టన్ను 3వేల రూపాయలున్న ఇనుప ఖనిజానికి 17 రూపాయలు రాయల్టీ వసూలుచేసిన ప్రభుత్వాల తీరుచూస్తే, గ్రామసభలకు రాయల్టీ ఆశచూపి ఒప్పిస్తారు తప్ప ఆ రాయల్టీలో ఇస్తానన్న సగం కూడా చెల్లిస్తారన్న ఆశలేదు. పంచాయితీల నిధులను ఇలాగే రాష్ట్రాలు దిగమింగుతున్నాయికదా!

భూవినియోగ ప్రణాళిక పేరిట ప్రతిగ్రామంలోనూ భూమిని వర్గీకరిస్తారు. వ్యవసాయభూమి, ఉమ్మడి భూమి, ఇళ్ళ స్థలాలు, బంజరు, ప్రభుత్వభూమి, వ్యవసాయానికి పనికిరాని భూమిగా వర్గీకరిస్తారు. ఈ భూములను ఎలా వినియోగించవచ్చో "శాస్త్రీయం"గా నిర్ణయిస్తారు. ఆవిధంగా భూమిని వ్యవసాయభూమి, వ్యవసాయేతర భూమిగా తేలుస్తారు. దీనిలో గ్రామ ఉమ్మడి భూమినీ, అన్ని విధాలుగా గుర్తించిన బంజరు భూమినీ పంచాయితీ పర్యవేక్షణలో వుంచుతారు. మరే భూమి, దాని వినియోగం గ్రామసభ లేదా పంచాయితీ పరిధిలోకి రాదు.

పాతచట్టం స్థానంలో ప్రతిపాదించిన భూసేకరణ బిల్లు 2012 (దీనిని పార్లమెంటు ఆగస్టు 1న ఆమోదించింది) ప్రకారం సేకరించిన భూమికి న్యాయమైన పరిహారం చెల్లించాలి అని ముసాయిదా పేర్కొంది.

భూసేకరణ ప్రజాప్రయోజనం కోసమేనా అన్న అంశం ప్రశ్నించరానిది. అది ప్రభుత్వ నిర్ణయం. వ్యవసాయేతర భూమిగా తాను గుర్తించిన భూమినీ, ప్రభుత్వ భూమినీ ప్రభుత్వం పరిశ్రమలు తదితరాలకు కేటాయిస్తుంది. వ్యవసాయేతర భూమిగా గుర్తించిన దానిలో ప్రైవేటు భూమివున్నా అది సేకరిస్తుంది. సారవంత వ్యవసాయ భూములను సేకరిస్తున్నారన్న విమర్శలకు ఇక అడిగే హక్కులేకుండా ముందే వ్యవసాయ భూమి కాదని వర్గీకరిస్తుంది. ఇక సమస్యల్లా నష్టపరిహార మొత్తానికి కుదించింది. గ్రామ సభ పాత్రను పర్యావరణ ప్రభావమన్న వండివార్చిన నివేదికను ఆమోదించటానికి కుదించింది.

ముసాయిదా ప్రారంభంలోనే ఇలా చెప్పింది. "నూతన భూమి వినియోగంనుండి చేకూరుతున్న లబ్ధి అసమపంపిణీ, తగినంత చెల్లింపులేని నష్టపరిహారం, అమలుజరగని పునరావాసం బాధిత ప్రజల్లో అపరిమిత అసంతృప్తికి దారితీస్తున్నది. ఇది అంతిమంగా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సామాజిక అసంతృప్తికీ, హింసకూ దారితీస్తున్నది. దీని పరిష్కారం కోసం, బాధితుల కష్టాలను తీర్చటంకోసం, సంస్కరణల అజెండాను సమగ్రంగా పునస్సమీక్షించాలి".

కానీ సంస్కరణ అన్న దానినే సమీక్షించింది. ప్రభుత్వ బలవంతపు భూసేకరణకు అడ్డుతగిలే హక్కులన్నింటినీ పరోక్షంగా రద్దుచేసేందుకు సంస్కరణలు అన్న పదానికి అర్థాన్ని విస్తరించింది. గ్రామసభలకు (ప్రజలకు) ఉన్న హక్కులను గౌరవిస్తానంటూనే వాటిని కుదించేందుకు పూనుకుంది.

## భూపంపకం అనివార్యం

విప్లవ భూపంపకాన్ని అమలు జరపకుండా, భూస్వామ్య వర్గాల ఆర్థిక రాజకీయ పునాదిని బలీయంచేసి, వారిని పెట్టుబడిదారీ భూస్వాములుగా క్రమ పరివర్తనచేసే విధానాన్ని పాలకవర్గాలు అనుసరించాయి. పైరుపచ్చ విప్లవం దీనిలో భాగమే.

నూతన ఆర్థిక విధానాలలో భాగంగా పైరుపచ్చ విప్లవం రెండవ దశ అనే దానిని అమలుజరుపుతున్నారు. ఆర్థిక మీటలతో రైతాంగాన్ని భూమినుండి వెళ్లగొట్టి భూమిని కంపెనీల పరంచేయబూనారు. ఆవిధంగా భూస్వాముల క్రమ పరివర్తను పూర్తిచేయదలిచారు.

ఇదే నేడు గ్రామసీమలనుభవిస్తున్న నరకయాతన. వ్యవసాయ వృద్ధి స్థంభించిపోయింది. వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపు తగ్గిపోయింది. గ్రామీణ రుణపరపతి సౌకర్యం కుదించుకుపోయింది. భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. నీటిపారుదలా భూములు చౌడుబారుతున్నాయి. గ్రామాలకూ-పట్టణాలకు మధ్య వలసలపర్వ జీవనం పేదల వంతు అయింది. రైతాంగ ఆత్మహత్యలకు అంతంలేకుండా పోయింది. వ్యవసాయం నుండి శాశ్వతంగా తప్పుకుంటున్న జనాభా రోజుకు 2 వేలకు చేరింది. ఆ మధ్యకాలంలో తగ్గిన కౌలు, తిరిగి భారమైన రూపంలో విస్తృతమౌతున్నది. కాగా వ్యవసాయం నుండి తప్పుకుంటున్న పేదలకు ప్రత్యామ్నాయ ఉపాధి లేదు. దీనితో భూమి కేంద్రీకరణ మరింతగా పెరుగుతున్నది. కాగా సాగులో ఏమాత్రం శ్రద్ధలేని వ్యవసాయేతర ఆదాయమే ప్రధానంగా వున్న ఉన్నత వర్గాలకు భూమి చేరుతున్నది. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తి స్థంభించిపోయి, వ్యవసాయ ఆధారిత గ్రామీణ పేదల కొనుగోలుశక్తి క్షీణిస్తున్నది. ఇది భారత ఆర్థికాభివృద్ధిని కృంగదీస్తున్నది.

ఈ విషచక్రాన్ని బ్రద్దలుకొట్టడానికి వున్న ఒకే విధానం దున్నేవానికే భూమి ప్రాతిపదికన భూమి పంపకాన్ని చేపట్టి పూర్తిచేయటం. దీనివల్ల గ్రామసీమలలో వచ్చే పెనుమార్పుల విప్లవతత్వం పాలకవర్గాలను భీతిల్లచేస్తున్నది. అందువల్లనే ముసాయిదాలో చెప్పినట్లు ప్రజలలో పెరుగుతున్న "సామాజిక అశాంతి, హింసల"ను చల్లార్చే చర్యలతో సరిపెట్టజూస్తున్నారు.

పాలకవర్గాల, వారి రాజకీయ ప్రతినిధుల ఈ సంస్కరణల బూటకత్వాన్ని గ్రామీణ పేదలకు వివరించి చెప్పి, వారిని విప్లవ భూసంస్కరణల అమలుకొరకు సంసిద్ధంచేయటమే నేడు మనముందున్న కర్తవ్యం. ✶

భారత పాలకవర్గాలు కోరుకుని అమలు జరపాలని పూనుకుని విఫలమైన సంస్కరణలుకావివి. రైతాంగ పోరాటాలనుండి భూస్వామ్య వర్గాలను కాపాడి, అర్థవలస - అర్థభూస్వామ్య వ్యవస్థ కూలిపోకుండా నిలిపేందుకు తప్పనిసరై తీసుకున్న చర్య యిది. పాశవిక నిర్బంధంతోనూ, భ్రమలతోనూ రైతాంగ పోరాటాలను వెనుకపట్టు పట్టించిన తర్వాత అలంకారప్రాయంగా మిగల్చదలచిన, మిగిల్చిన చర్యలివి.

పెసా చట్టం ప్రకారం ఆదివాసీ భూమి అన్యాక్రాంతం కాకుండా చూసే అధికారం గ్రామసభది. ఈ చట్టం వచ్చి(1996) 17 ఏళ్లు గడచినప్పటికీ, భూముల అన్యాక్రాంతాన్ని నివారించే గ్రామసభల అధికారాన్ని వినియోగించుకునేందుకు రూపొందించాల్సిన విధి విధానాలను ఇంతవరకూ ఒక్క రాష్ట్రప్రభుత్వమూ రూపొందించి, గెజెట్‌లో ప్రచురించలేదు. గ్రామసభల హక్కు కాగితాలకే పరిమితమైంది. ఆదివాసీ భూముల పరాయీకరణ నిరాటంకంగా సాగిపోతున్నది.

# ప్రపంచవ్యాపితంగా పనిప్రదేశాల్లో 'ప్రమాదాలు' - కార్మికుల దుర్మరణాలు

## బంగ్లాదేశ్

2013 జనవరి 26న, ఢాకాలోని ఒక చిన్న దుస్తుల పరిశ్రమలో మంటలు అంటుకొన్న సంఘటనలో ఏడుగురు మహిళా కార్మికులు మరణించారు. మంటలు వ్యాపించిన ఫలితంగా ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులెత్తినపుడు జరిగిన తొక్కిసలాటలో, ఊపిరాడక వీరు ప్రాణాలొదిలారు.

మే నెలలో, వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్న, అనేక దుస్తుల పరిశ్రమలున్న బహుళ అంతస్థుల భవనం కుప్పకూలిన ఘటనలో 1500 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయంగా పేరెన్నికగన్న ప్రముఖ కంపెనీలకు రెడీమేడ్ దుస్తులు తయారుచేసి, ఎగుమతిచేసే ఈ పరిశ్రమల యజమానులకు, ఈ బహుళ అంతస్థుల భవనం ఏ క్షణాన్నైనా కూలిపోతుందనే విషయం చాలా స్పష్టంగా తెలుసు. కార్మికుల ప్రాణాలను పణంగాపెట్టి వారి ఉత్పత్తి ఖర్చులను తగ్గించదలుచుకున్నారని విదితమౌతోంది.

జూన్‌లో, ఢాకాలోని మరో దుస్తుల పరిశ్రమలో 450 మందికిపైగా కార్మికులు వారికి సరఫరా చేయబడిన కాలుష్యనీటిని తాగిన ఫలితంగా అస్వస్థతకు గురయ్యారు. ఈ కార్మికులు తమ విధులు నిర్వహించటం ప్రారంభించిన కొద్ది సమయానికే వాంతులు చేసుకోవటం ప్రారంభించారు. వారినందరినీ హుటాహుటిన ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్స చేయించారు.

## రష్యా

2013 ఫిబ్రవరి1న, రష్యా ఉత్తరభాగంలోని కోర్ని రిపబ్లిక్కులోని ఒక బొగ్గుగనిలో సంభవించిన ప్రేలుడులో అనేకమంది గనికార్మికులు చిక్కుకున్నారు. వీరిలో 18మంది ప్రాణాలు కోల్పోయారు. భూమికి 800 మీటర్ల దిగువన 200 మందిపైగా పనిచేస్తున్న ఆ ప్రదేశంలోకి, మీథేన్‌వాయువు చొరబడటం వలన ఈ ప్రేలుడు జరిగింది.

## చైనా

2013 జనవరి 1న, హంగ్ ఝౌ రాష్ట్రం, గ్జియాషాన్ జిల్లాలో హాంగ్‌ఝౌ యుసాయ్ మెషినరి కంపెనీలో మంటలు వ్యాపించి ముగ్గురు ఫైర్‌మన్లు, ఐదుగురు కార్మికులు మరణించారు.

మార్చి 29న, టిబెట్ రాజధాని లాసాకు 68 కి.మీ. దూరంలోని మైజో కుంగర్‌లోనున్న జైమా కాపర్ పాలిమెటాలిక్ గనిలో, పై భాగం కూలిపోవటంతో 83 మంది కార్మికులు గనిలోనే చిక్కుకుపోయారు. షుమారు 4500 మంది రక్షణ సిబ్బంది, 200 యంత్రాలనుపయోగించి సమాధికాబడిన కార్మికుల శవాలను వెలికితీశారు. 59 మంది కార్మికుల మృతశరీరాలు లభ్యమయ్యాయి. గనిప్రదేశాన్ని విచక్షణారహితంగా విస్తరించుకుంటూ పోవటమే ఈ ఘోర ప్రమాదానికి ప్రధానకారణంగా వుంది. స్వయంప్రతిపత్తి గల టిబెట్ ప్రాంతంలోని విస్తారమైన లోహనిక్షేపాలను పెద్దఎత్తున త్వరితంగా వెలికితీయాలనే చైనా గనికంపెనీల లాభాపేక్ష, టిబెట్ గనుల ప్రాంతంలో కార్మికుల ప్రాణాలకు, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది.

జూన్ 7న, చైనాలోని ఓ బొగ్గుగనిలో ఇంధనవాయువు పేలుడు సంభవించి ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

ఏప్రిల్ 21న, చైనా ఈశాన్య ప్రాంతంలోని జిలిన్ రాష్ట్రంలోని క్వింగ్‌జింగ్ బొగ్గుగనిలో ఇంధనవాయువు ప్రేలుడు జరిగింది. ఈ ఘటనలో కనీసం 18మంది మరణించగా, మిగిలిన కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.

మే 11న, చైనాలో రెండు వేర్వేరు బొగ్గుగని ప్రమాదాలలో 34మంది గనికార్మికులు మరణించగా, మరో 9మంది గనిలో చిక్కుకుపోయారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న తావోజిగౌ బొగ్గుగనిలో ఇంధనవాయువు ప్రేలుడు సంభవించి 22మంది కార్మికులు దుర్మరణంపాలవగా, మరో తొమ్మిదిమంది గనిలో కూరుకుపోయారు. మరో బొగ్గుగనిలో 108మంది కార్మికులు పనిచేస్తుండగా సంభవించిన ప్రమాదంలో 12మంది కార్మికులు మరణించారు.

జూన్ 3న, చైనాలోని జిలిన్ బయూయాన్ ఫెంగ్ కౌంటీలోని మిషాజి టౌన్‌షిప్ ప్రాంతంలో సంభవించిన ప్రేలుడు అనంతరం జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 119మంది ప్రాణాలొదలగా, మరో 54మంది కార్మికులు గాయపడ్డారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో 300మంది కార్మికులు తమ విధుల నిర్వహణలో వున్నారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఆ పరిశ్రమ ద్వారాలు మూసివుండటంతో, అగ్నిప్రమాద బారినుండి తప్పుకునేందుకు కార్మికులకు సాధ్యంకాలేదు.

జూన్ 2న, చైనాలోని హూనాన్ రాష్ట్రపరిధిలోని ఓ బొగ్గుగనిలో జరిగిన ఇంధనవాయువు ప్రేలుడు ప్రమాదంలో కనీసం పదిమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

జూన్ 24న, షాంఘైలోని షాంఘై షెంగింగ్ కెమికల్ కంపెనీలో జరిగిన ప్రేలుడులో ఆరుగురు కార్మికులు గాయపడ్డారు.

## ఇరాన్

2012 డిసెంబర్ 10న తాబస్ నగరానికి దగ్గరలోని బొగ్గుగనిలో జరిగిన ప్రమాదకర వాయువు ప్రేలుడుధాటికి, గని కుప్పకూలింది. నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలుకోల్పోగా, మరో నలుగురి ఆచూకీ తెలియరాలేదు.

## సూడాన్

2013 మే 3న సూడానీస్ దారాఫర్ ప్రాంతంలో బంగారుగని కుప్పకూలిన ఘటనలో 100మందిపైగా కార్మికులు చనిపోయినట్లు అంచనావేశారు.

## దుబాయ్

2013 మే 15న, యుఏఇ వద్ద సెవేజ్ ప్రాజెక్టులో పనిచేస్తున్న భారతీయ కార్మికులు సజీవంగా సమాధిచేయబడ్డారు. అబూదాబీలోని రెండవ అతిపెద్దనగరమైన అల్‌అయిమ్ ప్రాంతంలోని అల్‌జాఫర్‌మియాలో వారు సజీవసమాధి చేయబడ్డారు.

## జపాన్

జపాన్‌లోని ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్ర శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న టోక్యో ఎలక్ట్రిక్ పవర్ సంస్థలో పనిచేస్తున్న షుమారు 2వేల మంది కార్మికులు నిరంతరాయంగా అణుధార్మికతకు గురవుతున్న ఫలితంగా థైరాయిడ్, క్యాన్సర్ బారిన పడేందుకు ఎక్కువ అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇందులో పనిచేసే ప్రతి కార్మికుడు కనీసం 100 మిల్లీ సెవార్ట్స్ అణుధార్మికతకు గురైన వాస్తవాన్ని 2013 జులైలో కనుగొన్నారు.

## దక్షిణకొరియా

2013 మార్చి 5న, దక్షిణకొరియాకు ఆగ్నేయంగానున్న గుమి నగర పారిశ్రామిక ప్రాంతంలో ఒక రసాయన కర్మాగారం నుండి వెలువడిన విషవాయువు కారణంగా 11మంది కార్మికులు అనారోగ్యానికి గురయ్యారు. చుట్టుప్రక్కల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలంతా వెనువెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేశారు. కార్మికులనేకమంది శ్వాసకోశ సంబంధమైన, కళ్ళకు సంబంధించిన ఇబ్బందులనెదుర్కొన్నారు.

## ఇండోనేషియా

2013 మే 15న, మిమికాలోని 'ఫ్రీ పోర్టు ఇండోనేషియా' గనిలో పైకప్పు కూలటంతో 17మంది కార్మికులు మృత్యువాతబడ్డారు. 11మంది తీవ్రగాయాలపాలయ్యారు. అమెరికాకు చెందిన ఫోయినెక్స్, అరిజోనాకు చెందిన ఫ్రీపోర్టు–మెక్‌మోరన్ కాపర్ అండ్ జింక్ పరిశ్రమలకు చెందినదే ఈ గని!

## అమెరికా

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో 2013 జులై 30న, ఓ ఇంధనవాయు ప్లాంటులో సంభవించిన వరుసప్రేలుళ్ళ కారణంగా ఏడుగురు కార్మికులు తీవ్రగాయాలపాలయ్యారు. అనేకమంది కార్మికుల జాడ తెలియలేదు. పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలను వెనువెంటనే ఖాళీచేయటంతో మరింత ఘోరం జరగకుండా ఆగింది.

## భారతదేశం

2012 డిసెంబరు 18న, మహారాష్ట్రలోని పూనే వద్దనున్న వాఘోలీలో నిర్మాణంలోనున్న ఓ ఆయుర్వేద కళాశాల భవంతి కూలిపోయి, 13మంది భవన నిర్మాణ కార్మికులు మృతిచెందారు. మృతులంతా వివిధ రాష్ట్రాలనుండి వలస వచ్చిన కూలీలే.

2013 జూన్ 1న, హర్యానా రాష్ట్రం–ఫరీదాబాద్ దగ్గరలోని భూనా వద్ద ఫ్యాక్టరీలో ఓ బాయిలర్ ప్రేలిపోయిన ఘటనలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

జూన్ 5న, విశాఖపట్నం వద్దనున్న నక్కపల్లి హెటిరో లాబ్స్ పరిశ్రమలో 20 కె.డబ్ల్యు. రియాక్టర్ పేలిన ఘటనలో ఇద్దరు కెమిస్టులు చనిపోగా, మరి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

జూన్ 6న సూరత్ దగ్గరలోని హజీరా వద్దనున్న ఐఓసి సంస్థ టెర్మినల్ యొక్క చమురు నిల్వవుంచే ట్యాంకుకు నిప్పంటుకోని సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో నలుగురు కార్మికులు మరణించారు. వీరంతా కాంట్రాక్టు కార్మికులే!

జూన్ 6న, ఒడిషా రాష్ట్రం అంగుల్‌లోని భూషాణ్ స్టీలుప్లాంటులోపల జరిగిన పెద్ద అగ్నిప్రమాదంలో కనీసం నలుగురు కూలీలు మృతిచెందగా మరి ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఝార్ఖండ్ నుండి వచ్చి, ఒక కాంట్రాక్టరు వద్ద పనిచేస్తున్న వలసకూలీలే వీరంతా!

జూన్ 6న, అస్సాం రాష్ట్రం – తూర్పుజైంటియా హిల్స్ జిల్లా సాయిపంగ్–ఖేలీహార్ట్ సరిహద్దులో ఉంప్లెంగ్ సిమెంట్‌కు చెందిన బొగ్గుబావిలో బొగ్గును మోసుకెళ్తున్నట్రాలీ మధ్యలో తెగిపడటంతో ఐదుగురు బొగ్గుగని కార్మికులు మరణించారు.

జనవరి 19న, కేరళ రాష్ట్రం – కొల్లం జిల్లాలోని మాలూరులోని ఓ బాణాసంచా కర్మాగారంలో మంటలు వ్యాపించి ముగ్గురు కార్మికులు చనిపోగా, ఒకతనికి తీవ్రగాయాలయ్యాయి. మరణించినవారిలో ఆ పరిశ్రమ యజమాని కుమారుడు కూడా ఉన్నాడు.

జనవరి 21న, విశాఖపట్నం స్టీలుప్లాంటులోని 100 కె.వి. విద్యుత్ కర్మాగారపు బాయిలర్ పైపులో ఏర్పడిన లీకేజీ కారణంగా, కార్బన్‌మోనాక్సైడ్ వెలువడి ఏడుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు.

జనవరి 22న, నల్గొండజిల్లా – భువనగిరి వద్దనున్న గుండపల్లిలోని శ్రీపతి లేబరేటొరీస్‌లో ఒక హెల్పర్ పైనుండి పడి, ఆసపత్రిలో చికిత్సపొందుతూ చనిపోయాడు. ఝార్ఖండ్ నుండి వచ్చిన వలస కార్మికుడు ఇతను.

జనవరి 28న, విశాఖపట్నం స్టీలుప్లాంటులోని బ్లాస్ట్‌ఫర్నేస్ మూడవ అంతస్తు పైనుండి పడి ఒక రెగ్యులర్ ఉద్యోగి మరణించాడు. అదే ప్లాంటులో థర్మల్ విద్యుత్తు కేంద్రంలో పనిచేసే మరో కాంట్రాక్టు ఉద్యోగి 5వ నంబరు బాయిలర్ వద్ద 30 అడుగుల ఎత్తులో నుండి పడి చనిపోయాడు.

జనవరి 30న, ఒడిషా రాష్ట్రం – రాయపూర్‌కు దగ్గరలోని బాలడ్ బజార్‌లోనున్న ఓ సిమెంటు ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మరి అనేకమందికి గాయాలయ్యాయి. బాధితులకు సరైన నష్టపరిహారం అందించాలని కార్మికులు ఆందోళనచేశారు. ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జికి పాల్పడ్డారు.

ఫిబ్రవరి 7న ముంబయి విమానాశ్రయానికి దగ్గరలో నిర్మాణంలోనున్న ఓ వంతెనపై అమర్చే సిమెంటుస్లాబు దిమ్మె ఒకటి కిందపడటంతో కనీసం ముగ్గురు కార్మికులు మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. క్రేను సాయంతో ఈ దిమ్మెను వంతెనపైకి చేరుస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

ఫిబ్రవరి 15న సింగరేణి కాలరీస్‌లో ఎ5–పివికె గనిలో పైకప్పు ఆకస్మికంగా కూలిపోవటంతో ఇద్దరు కార్మికులు చనిపోయారు. యాజమాన్యం కార్మికులకు సరైన భద్రతా ప్రమాణాలను చేపట్టకపోవటమే ఈ ప్రమాదానికి కారణం.

మార్చి 25న, బెంగుళూరు శివార్లలోనున్న మాగడి పారిశ్రామిక ప్రాంతంలోని సీట్లు మరియు గృహాలంకరణ వస్తువుల తయారీ పరిశ్రమలో మంటలు అంటుకొని తీవ్రంగా వ్యాపించటంతో ఆరుగురు కార్మికులు సజీవంగా దహనమయ్యారు. అంతకుముందు రోజంతా ఎస్ కె సీటింగ్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థకు దుబాయి కంపెనీ నుండి లభించిన ఒక పెద్ద ఆర్డర్ కనుగుణంగా ఫర్నిచర్ తయారీలో వుండి తిరిగి ఈ సంస్థ పనిలోకి వచ్చారు. వారు అంతకుముందురోజు రాత్రంతా నిద్రలేకుండా పనిచేస్తూనే వున్నారు.

మార్చి 30న ఆదిలాబాద్‌జిల్లా బరెమోడి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు గ్రామీణ ఉపాధిహామీపథకపు పనుల్లో రోజువారీ కూలీగా పాల్గొని, వడదెబ్బకు మృతిచెందాడు.

ఏప్రిల్ 8న, విశాఖ స్టీలుప్లాంటులో నూతనంగా నిర్మించిన బ్లాస్ట్‌ఫర్నేస్–3లో ప్రేలుడు సంభవించి ఐదుగురు కార్మికులు తీవ్రగాయాలపాలయ్యారు. భద్రతా ప్రమాణాలను పాటించటంలో యాజమాన్య నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం.

ఏప్రిల్ 24న, హైదరాబాద్, కూకట్‌పల్లిలోని హిందూజా గ్రూపుకుచెందిన గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్‌లో రియాక్టర్ ప్రేలుడులో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. 10మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రియాక్టర్ ప్రేలుళ్ళు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవటంలో యాజమాన్య వైఫల్యాన్ని నిరసిస్తూ కార్మికులు ఆందోళన చేపట్టారు. కాగా గల్ఫ్ ఆయిల్ కంపెనీ ఎమ్‌డి తమ సంస్థలో నిప్పంటుకోవటం లేదా ప్రేలుడువంటివేవీ సంభవించలేదని నిస్సిగ్గుగా అబద్ధమాడుతున్నాడు.

ఏప్రిల్ 25న, తమిళనాడు రాష్ట్రం–కొనంపట్టి వద్దనున్న ఓ బాణాసంచా తయారీ పరిశ్రమలో ప్రేలుడు జరిగి ముగ్గురు కార్మికులు మరణించారు.

ఏప్రిల్ 28న, తమిళనాడు రాష్ట్రం నాయనపురంలోని ఓ బాణాసంచా కర్మాగారంలో సంభవించిన ప్రేలుడు కారణంగా నలుగురు చనిపోగా, ఎనిమిదిమందికి కాలిన తీవ్రగాయాలయ్యాయి.

మే 11న గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య విభాగానికి చెందిన పనిలో భాగంగా ఒక మ్యాన్‌హోల్‌లో దిగి శుభ్రంచేస్తున్న ఇద్దరు పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులు మృతిచెందారు. లోతైన మ్యాన్‌హోల్‌లో ఇద్దరు కార్మికులు పడిపోయారు. మున్సిపల్ యాజమాన్యం ఈ కార్మికులకు తగిన రక్షణ పరికరాలు అందించకపోవటం కారణంగానే వీరు చనిపోయారు.

మే 21న, మేఘాలయలోని, ఇరాఎమింగ్ గ్రామంవద్దనున్న ఓ బొగ్గుగనిలో బొగ్గును నింపి తీసుకెళ్ళే క్రేను యొక్క తీగెలు తెగిపోవటంతో, ముగ్గురు కార్మికులు మరణించగా మరో ఇద్దరు గాయాల పాలయ్యారు.

మే 21న, భీమవరం మునిసిపల్ అధికారుల పర్యవేక్షణలో మురుగునీటి పారుదలకోసం నిర్మాణంచేస్తున్న ఓ గోడ కుప్పకూలటంతో ఇద్దరు కార్మికులు చనిపోగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పర్యవేక్షణాధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవటమే గోడకూలిపోవటానికి, కార్మికుల మరణాలకు కారణమైంది.

మే 28న, రాజస్థాన్‌లోని డెలి మరియు మందన రాతి క్యారీలలో పనిచేస్తున్న కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించిన ఓ వైద్యుడు కొన్ని వివరాలను వెల్లడించాడు. పెద్దపెద్ద రాతిబండలను శబ్దరహితంగా పగులగొట్టేందుకు ఇటీవల కాలంలో చైనానుండి దిగుమతి చేసుకున్న ఓ రసాయన పౌడరును ఉపయోగిస్తున్నారని, దీని ఫలితంగా కార్మికుల చూపు మందగించటంతోపాటు, చూపుకోల్పోతున్నారని వివరించారు. ఈ రసాయనాన్ని ఉపయోగించిన వెనువెంటనే దానిప్రభావం కార్మికుల కళ్ళపైబడి, వారిని అంధత్వానికి గురిచేస్తోందని, ఇటువంటి కేసుల సంఖ్య అధికమౌతోందని వెల్లడించారు.

జూన్ 12న, హైద్రాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఓ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుడు, స్థానిక ఢిపెన్స్‌కాలనీలోని ఓ మ్యాన్‌హోల్‌ను శుభ్రంచేస్తుండగా జరిగిన ప్రమాదంలో మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. మ్యాన్‌హోల్‌లోకి దిగి శుభ్రంచేస్తుండగా విషవాయువులు చుట్టుముట్టి స్పృహ కోల్పోయాడు. దీనిని గమనించిన మరో ఇద్దరు కార్మికులు అతనిని రక్షించేందుకు మ్యాన్‌హోల్‌లోకి దిగారు. అయితే, ఆకస్మికంగా మురుగునీటి ఉధృతి పెరగటంతో అతనిని కాపాడలేకపోగా వీరూ స్పృహతప్పారు. కాగా, చివరి నిముషంలో పైకి తీయటంతో వీరికి ప్రాణాపాయం తప్పింది. ✡

# అమలు చేయాల్సింది రుణఅర్హత కార్డులు కాదు, కౌలుదారీ చట్టాలు

**సేద్యానికి** సకాలంలో సాగునీరు అందక ఎరువులు, విత్తనాలు క్రిమిసంహారక మందుల ధరలు పెరిగి సేద్యపు ఖర్చులు భారంగా మారటం, ప్రకృతి వైపరీత్యాలవలన పంటలకు తీవ్రనష్టం వాటిల్లటం, పండిన పంటలకు న్యాయమైన ధర లభించకపోవటం, ఫలితంగా పెట్టిన పెట్టుబడికూడా రాక అప్పులపాలౌతున్న రైతాంగం చివరకు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నారు. కౌలురైతాంగం మరింత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. పంటఖర్చులతోపాటు కౌలుకి కూడా పెట్టుబడి సమకూర్చుకోవాల్సి వస్తున్నది. వీరికి బ్యాంకులనుండి సంస్థాగత రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. అందుకు కారణం కౌలు భూమి ద్వారానైనా ఉపాధి పొందుతామనే ఆశ. ప్రకృతి వైపరీత్యాలవలన నష్టాలపాలైన వీరికి ప్రభుత్వం అందించే నామమాత్రపు సహాయం, సబ్సిడీ కూడా అందదు. కౌలుభూమితో ఉపాధి పొందుదామనుకొన్న వీరు చివరికి, వున్న ఆసరాను కూడా పోగొట్టుకొని నిలువ నీడలేని, బ్రతుకుదెరువు కానరాని పరిస్థితికి నెట్టబడి ఆత్మహత్యలకు పాల్పడవలసి వస్తున్నది. ఆత్మహత్యలు చేసుకొన్న రైతుల్లో 80శాతందాకా కౌలురైతులే అన్న వాస్తవం వారి సంక్షోభాన్ని తెలియజేస్తున్నది.

కౌలురైతులు ఇంత దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రభుత్వాలు అనుసరించిన విధానాలే కారణం. వలసపాలనలోనూ, 'స్వతంత్ర' పాలనలోనూ కౌలుదార్లకు రక్షణ కల్పించాలని, సేద్యానికి విత్తనాలు, ఎరువులు సబ్సిడీ రూపంలో అందించాలని, పంట ఖర్చులకు బ్యాంకులద్వారా రుణాలు అందించాలని అనేక ఉద్యమాలు సాగించారు. ఉద్యమం మిలిటెంట్ స్వభావం సంతరించుకొంది. ఉద్యమాలను దారిమళ్లించే విధంగా, కౌలురైతులకు భ్రమలు కల్పిస్తూ తీసుకువచ్చినవే– తెలంగాణ రక్షిత కౌలుదారీ చట్టం, ఆంధ్రా కౌలుదారీ చట్టాలు!

1950లో చేసిన తెలంగాణ రక్షిత కౌలుదారీ చట్టం, కౌలుదార్లందరినీ ఒక విభాగంగా గుర్తిస్తుంది. ఈ చట్టంప్రకారం ఆరు సంవత్సరాలపాటు కౌలుదారునిగా కొనసాగితే, ఆ భూమి స్వాధీనం పొందేహక్కు అతనికి వుంటుంది. అతడు ఆ భూమిని కొనుగోలు చేసుకోవచ్చు. భూయజమానుల నుండి భూములను కొనుగోలు చేసుకోవటానికి హక్కుగల రక్షిత కౌలుదార్లందరికీ భూయాజమాన్య హక్కులను బదలాయించి అప్పగించాలి. వారిని ఆ భూయజమానిగా గుర్తిస్తూ తాశీల్దార్ ఒక సర్టిఫికెట్ మంజూరుచేయాలి. భూమిపై కౌలుహక్కు వంశపారంపర్యంగా వస్తుంది. కౌలుదారుడు భూమిని తనఖాపెట్టుకోగలడు; ఆ భూమిద్వారా సంస్థల నుండి లబ్ధిపొందగలడు. ఈ విధంగా ఈ చట్టం కౌలుదారునికి హక్కులు కల్పిస్తూ అభ్యుదయకరంగా పైకి కన్పిస్తున్నా, ఆ హక్కులను కాలరాసేందుకు చట్టంలోనే భూస్వాములకు హక్కులు కల్పించారు. కౌలుకాలంలో కౌలు చెల్లించకపోయినా, భూమిని ఇతర విధానాలకు వినియోగించినా, కౌలుకాలం తీరకపోయినప్పటికీ కౌలు ఒప్పందం రద్దుచేసుకొని భూయజమాని, కౌలుదారుని భూమినుండి తొలగించవచ్చు. అంతేకాకుండా స్వంత సేద్యంకోసం కౌలుదారుని నుండి భూమిని వెనక్కి తీసుకోవచ్చు. ఇది కౌలుదారునికి తీవ్ర నష్టాన్ని కలిగించేది; భూస్వాములకు చాలా ఉపయోగకరమైంది. చట్టంలో కల్పించిన అవకాశాలను ఉపయోగించుకొని కౌలు ఒప్పందం ముగియకముందే పెద్దసంఖ్యలో కౌలుదార్లను భూములనుండి వెళ్లగొట్టారు. కొద్దిమంది మాత్రమే రక్షిత కౌలుదార్లుగా కొనసాగారు. ఈ విధంగా ఈ చట్టాన్ని నిర్వీర్యం చేశారు.

ఆంధ్రప్రాంతంలో కౌలుదారీ విధానం, ఆంధ్రప్రదేశ్ కౌలుచట్టం–1956 అనుసరించి వుంటుంది. వ్యవసాయక భూములకు సంబంధించి కౌలుదార్లు చెల్లించవలసిన న్యాయమైన కౌలు, భూస్వాములకు, కౌలుదార్లకు మధ్య వుండవలసిన సంబంధాలను చట్టం నిర్దేశించింది. భూమిపై అనుభవ హక్కును కల్పించటం, భూస్వామికి గరిష్టకౌలు చెల్లించటం చట్టం లక్ష్యంగా పేర్కొంది. చట్టం అమలులోకి వచ్చే నాటికి కౌలు ఒప్పందాలన్నీ చట్టప్రకారం కొనసాగుతున్నట్లేనని పేర్కొనటం జరిగింది. కౌలు ఒప్పందం ఆరు సంవత్సరాలు వుంటుంది. గడువు ముగియగానే ఒప్పందం మరో ఆరు సంవత్సరాలు కొనసాగుతుంది. షరతులు యధాతథంగానే వుంటాయి. కౌలుదారుడు ప్రభుత్వానికి, సహకార సంఘాలకు, భూ తనఖా బ్యాంక్‌లతో సహా ఇతర సంస్థలకు కూడా తనఖా పెట్టుకోవచ్చు లేదా రుణాలు పొందవచ్చు. భూయజమాని భూమి అమ్ముకోదలిస్తే ఆ అవకాశం మొదట కౌలుదారుకే ఇవ్వాలి.

సక్రమంగా కౌలు చెల్లించకపోవటం, ఉపకౌలుకి ఇవ్వటం, ఒప్పందంలోని షరతులను ఉల్లంఘించటం వంటి సందర్భాల్లో తప్ప కౌలు ఒప్పందం రద్దుచేయటం సాధ్యంకాదు.

కౌలుదారీ చట్టాలవలన కొద్దిమంది కౌలుదారులకు మాత్రమే ప్రయోజనం కలిగింది. చట్టాలకు ముందు ఉన్న కౌలుదారులు చట్టపరిధిలోకి రావటంవలన వారు కౌలుహక్కులు పొందగలిగారు. వీరిలో కూడా కొందరిని దౌర్జన్యంగా భూస్వాములు తొలగించగలిగారు. కొందరు భూయజమానులు మాత్రమే చట్టప్రకారం గత కౌలుదార్లతో ఒప్పందం చేసుకొన్నారు. చట్టం వచ్చిన తర్వాత భూస్వాములు, ఇతర భూకామందులు, భూమి కౌలుకి లిఖితపూర్వక ఒప్పందాలు కాకుండా నోటి మాట ఒప్పందాలే చేసుకున్నారు. ఇలాంటి కౌలుదారులకు చట్టంలో పేర్కొన్న హక్కులేవీ వర్తించలేదు. ప్రకాశం, గుంటూరు, క్రిష్ణాజిల్లాలో పలు సామాజిక సంస్థలు నిర్వహించిన సర్వేలో నూటికి నూరుశాతం కౌలు ఒప్పందాలు నోటిమాటపూర్వకంగానే వున్నట్లు వెల్లడైంది.

భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించే పాలకులు, ఏ చట్టం చేసినా వారి ప్రయోజనాలకు భంగం లేకుండానే చేస్తారు. కౌలుదారీ చట్టాలు అందుకు అద్దంపడుతున్నాయి. చట్టపరిధినుండి భూస్వాములు తప్పించుకోవటానికి చట్టాలు కూడా దోహదపడ్డాయి. చిత్తశుద్ధిలేని పాలకులు అన్ని చట్టాలలాగానే కౌలుదారీ చట్టాలను నిర్వీర్యం చేశారు. చట్టాలు చిత్తశుద్ధితో అమలు జరిపే పాలకులైతే ఎవరు కౌలుదారులన్నది గుర్తించి, భూస్వాములు అంగీకరించకపోయినా, కౌలుదారులకు హక్కులు కల్పించేవారు.

భూమిలేని గ్రామీణ పేదలకు లభించే ఉపాధి అవకాశాలు తరిగిపోయి ఉపాధిని వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడి అందుకు కౌలుభూమికోసం పోటీ ఏర్పడి ఎటువంటి ఒప్పందాలు లేకుండా నోటిమాటగా భూమిని కౌలుకి తీసుకోవటం జరిగింది. భూయజమాని తనకిష్టమైతే భూమి కౌలుని కొనసాగించేవాడు; ఇష్టంలేని పక్షంలో మరో కౌలుదారునికి ఇచ్చేవాడు. ఈ విధంగా కౌలుదార్లకు రక్షణలేకుండా పోయింది. కౌలు చెల్లింపులో వచ్చిన మార్పులవలన రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కౌలు చెల్లింపు నేడు డబ్బురూపంలోకి మారింది. కౌలురైతులకు ఇది మరింత భారంగా మారింది. సేద్యానికి అధిక పెట్టుబడికావాల్సి వచ్చింది. కౌలు హక్కులు లేని వీరికి బ్యాంక్‌ల నుండి పంట రుణాలు లభించవు. ప్రకృతి వైపరీత్యాలవలన సంభవించే పంట నష్టాలకు పరిహారం అందదు. పొట్టకట్టుకొని కూడబెట్టుకొన్న సొమ్ముతోపాటు అదనంగా అప్పుచేసి కౌలురైతులు సేద్యం చేస్తున్నారు. పంట నష్టపోయినప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోయి కౌలు సేద్యంనుండే వైదొలగుతున్నారు. బ్రతుకు తెరువు మార్గం కానరాక సుదూర ప్రాంతాలకు వలసలు పోవటమో, లేక ఆత్మహత్యలను ఆశ్రయించటమో చేస్తున్నారు.

కౌలుదారీ చట్టాల్లో వున్న లొసుగులను తొలగించి చట్టాన్ని సక్రమంగా అమలు జరపాలనే ఉద్యమాల వెనుకపట్టు ఫలితంగా కౌలుదార్లకు చట్టాన్ని వర్తింప చేయాలన్న రాజకీయ డిమాండ్ స్థానంలో కౌలు రైతులకు రుణాలు అందించాలని, పంటనష్టపరిహారంతోపాటు రైతులకు యిచ్చే అన్ని రాయితీలు వీరికి ఇవ్వాలనే ఆర్థిక డిమాండ్లే ప్రధానమైనాయి.

కౌలుదారీ చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేయటాన్ని పాలకులు లక్ష్యంగా పెట్టుకొన్నారు. అందుకు ప్రతిపక్ష పార్టీలు, కొన్ని రైతుసంఘాలు చేసిన డిమాండ్లు, పాలక ప్రభుత్వానికి మంచి అవకాశాన్నిచ్చింది. కౌలురైతులను ఆదుకొంటామని, పంటరుణాలు, నష్టపరిహారాలు అందజేస్తామని ప్రకటించింది. ఇలాంటి ఆర్థిక డిమాండ్లు ఆమోదించటంవలన పాలకవర్గాలకు, తమ వర్గ ప్రయోజనాలు దెబ్బతినవన్న విషయం తెలుసు. మాటల్లో అంగీకరించి ఆచరణలో మొండిచేయి ఎలా చూపాలో కూడా కాంగ్రెస్ పాలకులకు కొట్టిన పిండి. ఈ విషయంలోనూ అది తేటతెల్లమైంది.

రుణాలు ఇవ్వటానికి బ్యాంక్ అధికారులను ఒప్పించామని, కౌలురైతులు బ్యాంక్‌లకు వెళ్లి రుణాలు పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రకటనను నమ్మి, కౌలురైతులు బ్యాంకులకు వెళితే అక్కడ వారికి చేదు అనుభవం ఎదురైంది. వారిని బ్యాంకులనుండి గెంటివేసే పరిస్థితి ఎదురైంది. కౌలు పత్రాలు లేకుండా రుణాలు ఇవ్వటం సాధ్యంకాదని అధికారులు తేల్చి చెప్పారు. కౌలురైతులు అవమానభారంతో బ్యాంకుల నుండి బయటకు వచ్చారు. దీంతో కౌలురైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విమర్శలు వెల్లువెత్తాయి. కౌలురైతుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు రైతుమిత్ర గ్రూపులను ఏర్పాటుచేసి, డ్వాక్రా గ్రూపులకు యిచ్చినట్లుగానే సమిష్టి బాధ్యతపై కొన్ని గ్రూపులకు మాత్రమే రుణాలు అందజేశారు. 80% మందికి పైగా రైతులకు ఈ మేరకు రుణాలు కూడా అందలేదు. దీనిపైన కౌలురైతుల్లోనూ, రైతుకూలీసంఘాలనుండి, రైతుశ్రేయస్సు కోరే వారినుండి విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ విమర్శలనుండి బయటపడేందుకు కౌలుదార్లకు రుణపరపతి కార్డులు అందచేస్తామని చెప్పి ప్రభుత్వం ముసాయిదా పత్రాన్ని విడుదల చేసింది. భూయజమానుల అంగీకారంలేకపోయినా రుణపరపతి కార్డులు అందజేస్తామని, ఈ కార్డుల వలన భూమిపై కౌలుదారులకు ఎటువంటి హక్కు వుండదని, రుణం పొందటానికి మాత్రమేనని, భూమిపై హక్కులన్నీ యజమానులకే వుంటాయని పేర్కొంది. యజమానుల అంగీకారంతో యిచ్చిన కార్డులు చాలా తక్కువన్న వాస్తవాన్ని గ్రహించాలి. మిగతావన్నీ అందుకు విరుద్ధంగా జరిగినవే. ఈ కార్డులు కౌలురైతులకు బ్యాంకులనుండి రుణాలు ఇప్పించలేకపోయాయి. కార్డులతో రుణాలు ఇవ్వటం సాధ్యంకాదని, రైతుల అనుమతి పత్రం కావాలని అధికారులు చెప్పటంతో రైతులు నివ్వెర పోయారు. దీనిపైనా రైతుల్లో ఆగ్రహం వ్యక్తంకావటంతో బ్యాంకులను ఒప్పించి రుణాలు అందిస్తామని ప్రభుత్వం మాటల గారడీ ప్రారంభించింది.

మూడు సంవత్సరాల కాలంలో కౌలురైతులందరికీ ఈ కార్డులు కూడా ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. కార్డులు పొందిన వారిలోనూ చాలా కొద్దిమందికి మాత్రమే రుణాలు అందాయి. రాష్ట్రంలో 30 లక్షలమంది దాకా కౌలురైతులు వుంటే ఈ సంవత్సరం ఇప్పటివరకు 3.23 లక్షలమందికి మాత్రమే రుణ పరపతికార్డులు యిచ్చారు. వీరికి బ్యాంకులు మంజూరుచేసిన రుణం 23.32 కోట్లు మాత్రమే. గత సంవత్సరం 4,23,328 మందికి రుణ అర్హతకార్డులు యిచ్చి, వారికి 2 వేల కోట్ల రుణాలు లక్ష్యంగా ప్రకటించినప్పటికీ 270 కోట్లకు మించి రుణాలు మంజూరు కాలేదు. ఇది కూడా రైతు మిత్ర గ్రూపుల పేరుతోనే మంజూరు చేయటం జరిగింది తప్పితే కౌలుదార్ల క్రింద మంజూరు కాలేదు. గత వ్యవసాయ సీజన్, ఈ వ్యవసాయ సీజన్‌లను పోల్చి చూసుకొంటే రుణ అర్హత కార్డులు, మంజూరు అయిన రుణంలో కూడా చాలా వ్యత్యాసం వుంది. ఈ సంవత్సరం కౌలురైతులకు అందిన రుణం కంటితుడుపుకి కూడా సరిపోని విధంగా వుంది.

ఈ సంవత్సరం 8.7.13 నాటికి రుణఅర్హత కార్డు పొందిన వారు, జిల్లాలవారీగా వారికి అందిన రుణం ఈ విధంగా వుంది. **(పట్టిక–1 చూడండి)**

ఈ పట్టికను పరిశీలిస్తే ఒక్క రైతుకు కూడా రుణం అందని జిల్లాలు ఎనిమిది వుండగా 10 నుండి 92 లక్షలు మాత్రమే అందిన జిల్లాలు ఏడు వుండగా, కోటికిపైగా రుణం అందిన జిల్లాలు 4 మాత్రమే వున్నాయంటే కౌలురైతులకు రుణపరపతి ఎంత ప్రహసనంగా మారిందో అర్థమౌతుంది. 3,23,337 కార్డులకుగానూ 23.32 కోట్లు రుణాలుగా యిచ్చారంటే సగటున ఒక కార్డుకు 721 రూ॥ రుణం యిచ్చారు. మరో రకంగా చెప్పాలంటే ఒక ఎకరానికి 5వేల రూ॥ల పంటరుణం అవసరమనుకుంటే కేటాయించిన రుణం దాదాపు 47 వేల మందికి మాత్రమే సరిపోతుంది. రుణకార్డులున్న వారిలో 14 శాతానికి మాత్రమే, కేటాయించిన రుణం సరిపోతుంది. ఎకరం వరిపండించ టానికి కౌలుకాకుండా 25వేల రూ॥ల వరకూ పెట్టుబడి అవసరమన్న నిజాన్ని గుర్తుంచుకుంటే, ఈ రుణ వితరణ ఎంగిలిచెయ్యి విదిలిస్తే పడే మెతుకుల వంటిది.

రుణకార్డుల మంజూరు కౌలురైతులకు ఎంతో మేలు చేసేదని అభివర్ణించిన ప్రతిపక్ష పార్టీలు, కొన్ని రైతుసంఘాలు కౌలు ఒప్పంద పత్రాలు లేకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వవని తెలిసికూడా ప్రభుత్వ నిర్ణయాన్ని ఎందుకు స్వాగతించారు? కౌలుదారీ చట్టాల అమలు గురించి ఎందుకు మాట్లాడలేదు? కౌలుదారీ చట్టం అమలు జరిగితేనే, కౌలు ఒప్పంద పత్రాలు కౌలురైతులు పొందగలుగుతారన్న విషయం వీరికి తెలిసే దాన్ని ఎందుకు డిమాండ్ చేయలేదు? ఒకే తానులో ముక్కలుగా కౌలురైతాంగాన్ని భ్రమలతో వంచించేందుకే పాలకవర్గపార్టీలు వ్యవహరించాయి.

కౌలురైతుల ఎడల ప్రభుత్వం అనుసరిస్తున్న మోసకారి విధానాలను, కౌలుదారీ చట్టాలను కనుమరుగు చేసే విధానాలను గ్రహించి అందుకు వ్యతిరేకంగా కౌలుదారీ చట్టాలలో వున్న లొసుగులను తొలగించి ఆ చట్టాలను అమలుపరపాలని కౌలురైతులందరూ సమైక్యంగా ఉద్యమించటం ద్వారానే తమకు రక్షణ ఏర్పడుతుందని గ్రహించాలి. ✱

**పట్టిక:1**

| జిల్లా | రెన్యువల్ | కొత్తవి | మొత్తం కార్డులు | పొందిన రుణం(కోట్లలో) |
|---|---|---|---|---|
| విజయనగరం | 14,631 | 7,977 | 22,608 | 0.75 |
| పశ్చిమగోదావరి | 92,776 | 12,996 | 1,06,772 | 7.92 |
| క్రిష్ణా | 5,916 | 3,578 | 9,492 | 0.36 |
| గుంటూరు | 3,529 | 17,610 | 21,139 | 3.10 |
| ప్రకాశం | – | – | – | – |
| నెల్లూరు | 29,179 | 10,230 | 39,409 | 0.92 |
| కర్నూలు | – | – | – | – |
| చిత్తూరు | 8,389 | 784 | 9,152 | 0.05 |
| నిజామాబాద్ | 2,100 | 2,988 | 5,088 | 0.20 |
| మెదక్ | 497 | 1,109 | 1,606 | 0.00 |
| వరంగల్ | 72 | 173 | 245 | 0.10 |
| కరీంనగర్ | 1,765 | 4,960 | 6,725 | 0.00 |
| ఆదిలాబాద్ | 1,425 | 928 | 2,958 | 0.00 |
| రంగారెడ్డి | 76 | 43 | 113 | 0.00 |
| నల్గొండ | 80 | 498 | 569 | 0.20 |
| మహబూబ్‌నగర్ | 428 | 228 | 656 | 0.00 |
| ఖమ్మం | 4,475 | 9,828 | 14,303 | 0.41 |
| మొత్తం | 2,22,848 | 7,00,489 | 3,23,337 | 23.32 |

**ఆధారం : సాక్షి, జులై**

*Read !* *Subscribe!!*




English Organ of
Central Committee of CPI (ML)

*Read !* *Subscribe!!*




Hindi Organ of
Central Committee of CPI (ML)

# తీవ్రమవుతోన్న -మతోన్మాద ఉద్రిక్తతలు, మహిళలపై అత్యాచారాలు, ప్రాంతీయ వైషమ్యాలు, ఫాశిస్టుదాడులు - విడివిడి అంశాలు కావు

**గత** సంవత్సరం డిసెంబరు నెలలో ఢిల్లీలో యువతిపై సామూహిక హత్యాచారం సంఘటన తదనంతరం పెద్ద ఎత్తున ప్రజా నిరసన పెల్లుబికింది. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ముందుకొచ్చిన డిమాండ్‌తో, కేంద్ర ప్రభుత్వం చాలా 'కసరత్తులు' చేసి చివరకు 'నిర్భయ' చట్టం చేసి అందరూ నిశ్చింతగా ఉండవచ్చని చెప్పి చేతులు దులుపుకుంది.

ఈ కాలమంతటా మహిళలపై సాగుతున్న ఘోరాలపై అందరి దృష్టీ కేంద్రీకృతమవటంతో జాతీయ మీడియా - ముఖ్యంగా దినపత్రికలు, అప్పటి వరకు స్థానికవార్తలుగా పరిమితం చేసిన మహిళలపై అత్యాచార ఘటనలను ప్రధాన పేజీలలో ప్రచురించటంతో, ఈ ఘోరాల జాబితా అందరినీ కలవరపరిచింది. 'నిర్భయ' చట్టం తదనంతరం కూడా ఆ 'జాబితా' ఏమాత్రం తగ్గలేదనేది స్పష్టం.

2013 ఆగస్టు 22న దేశ వాణిజ్య రాజధాని ముంబయి మహానగరంలో సాయంకాల సమయంలో ఓ ఆంగ్ల వారపత్రికకు చెందిన ఓ మహిళా ఫోటో జర్నలిస్టు తన సహోద్యోగితో కలిసి వృత్తిపరమైన కథనానికి వివరాల సేకరణలో భాగంగా శక్తిమిల్స్ ప్రాంతానికి వెళ్ళింది. అప్పటికి ఎంతోకాలంగా మూతపడి వున్న ఆ శక్తిమిల్స్ భవనాల ఫోటోలను తీస్తుండగా కొందరు గూండాలు ఆమె సహోద్యోగిని నిర్బంధించి, ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. జర్నలిస్టులతో సహా దేశంలోని వివిధ ప్రాంతలలో ఈ సంఘటనపట్ల తీవ్ర నిరసన వ్యక్తమైంది.

సరిగ్గా ఇదేసమయంలో ఖమ్మంజిల్లాలో గిరిజన మహిళపై సామూహిక అత్యాచారం, 22-8-13న ఓ మహిళా కానిస్టేబుల్ తన చెల్లెలి మృతదేహాన్ని తీసుకొని జార్ఖండ్ రాష్ట్రంలో రాంచీ నుండి గార్వా వెళుతుండగా లాతేహారె వద్ద హెూరమైన లైంగిక దాడికి గురవటం, ఇలా పరంపరగా అనేక సంఘటనలు వార్తలలో చోటు చేసుకున్నాయి. తిరిగి వీనిపై చర్చలు అనంతంగా సాగుతున్నా అవేవీ సమస్యల మూలాలను తాకలేకున్నాయి.

స్త్రీలను కించపరిచే, అసభ్యంగా చిత్రీకరించే సినిమా, సీరియల్స్‌ను నిలిపివేయకుండా; ప్రాథమిక స్థాయి నుండే మహిళలను గౌరవించే సంస్కృతిని పెంపొందించకుండా; మరీ ముఖ్యంగా ఇంటర్‌నెట్‌ల ద్వారా దిగుమతి అవుతున్న నీలి చిత్రాల ప్రసారాలను నిషేధించకుండా; స్త్రీలపై అత్యాచారాలకు, లైంగిక దాడులకు కారణమవుతున్న మద్యం వ్యాపారాన్ని అరికట్టకుండా; వీటన్నింటికీ మూలమైన - స్త్రీలను వ్యాపార సరుకుగా, భోగవస్తువుగా జూసే సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతిని, పితృస్వామ్య అధిపత్య భావజాలాన్ని నిర్మూలించకుండా మహిళలపై వివక్ష, లైంగికదాడులు అరికట్టడం అసాధ్యం.

కాగా, స్త్రీలపై అత్యాచారాల కారణాలను తొలగించేందుకు పైవాటిలో ఏ ఒక్కచర్యనూ తీసుకోని పాలకులు, స్త్రీలపై ఇటువంటి ఘోరాలు జరిగి ప్రజల స్పందన తీవ్రంగా వ్యక్తమైనపుడు, ప్రజలతో గొంతు కలిపి తామూ గుండెలు బాదుకోవడం, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు విచారణ కమిటీలు, నివేదికలు, పకడ్బందీ చట్టాలంటూ, దోషులకు కఠిన శిక్షలంటూ మోసగింపుల చర్విత చరణ క్రమాన్ని ఎన్నిసార్లైనా సాగించగలరు.

* * *

పాలకపక్షాలు అందివచ్చిన ప్రతిసందర్భాన్నీ మత దురహంకార భావజాల వ్యాప్తికీ, మత ఉద్రిక్తతల మంటలలో చలిగాసుకునేందుకూ మొరటుగానో, నాజూకుగానో తమ ప్రయత్నాలు సాగిస్తూ వస్తున్నారు.

పాకిస్తానుకు చెందిన కొందరు చిత్రకారులు గీసిన చిత్రలతో అహ్మదాబాద్‌లోని ఆర్ట్ గ్యాలరీలో ఇటీవల ఓ చిత్ర కళాప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ఆర్ట్ గ్యాలరీపై విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ సంస్థల ప్రతినిధులు మూకుమ్మడిగా దాడిచేసి అనేక చిత్ర పటాలను ధ్వసం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన చిత్రాల ప్రదర్శన కావటమే వారి దాడికి కారణమని ప్రకటించారు.

* * *

సుదీర్ఘకాలంగా మూఢనమ్మకాలకు, అంధ విశ్వాసాలకు, క్షుద్రతాంత్రిక పూజలకు, వాటిని కొనసాగిస్తున్న బాబాలకు వ్యతిరేకంగా భావజాల పరంగానూ, కార్యాచరణలోనూ పోరాడుతున్న ప్రముఖ హేతువాద నాయకుడు, ప్రజాతంత్ర వాది నరేంద్ర దభోల్కర్ (69సం॥లు) ను మహారాష్ట్రలోని పూనేలో 2013 ఆగస్టు 20న హిందూ మతోన్మాద సంస్థలకు చెందిన కొందరు తుపాకీతో కాల్పులు జరిపి హత్యగావించారు. నరేంద్ర దభోల్కర్ సాగిస్తున్న హేతువాద భావప్రచారాన్ని, మూఢవిశ్వాసాలపై సాగించే సమరాన్ని సంఘ్ పరివార్ శక్తులు సహించ లేకున్నాయి. అతని అంతుచేస్తామని హెచ్చరికలు, 'నెట్'ల ద్వారా బెదిరింపులు చేసినా కూడా దభోల్కర్ వాటిని లక్ష్యపెట్టకుండా తన కార్యకలాపాలను సాగిస్తూ రావటం మతతత్వశక్తులకు కంటగింపైంది. దభోల్కర్‌ను హత్యచేయడం ద్వారా ఆయన వ్యాప్తి చేస్తున్న భావజాలాన్ని అడ్డుకోగలమనుకుంటున్న హంతకులు ఫాశిస్టుదాడులకు తెగబడ్డారు. మూఢ నమ్మకాలకు, క్షుద్ర తాంత్రిక విద్యలకు వ్యతిరేకంగా ఓ చట్టం తేవాలని దశాబ్దాలుగా పోరాడుతున్న దభోల్కర్ మాటలను పెడచెవి పెట్టిన మహారాష్ట్ర సర్కార్, ఆతని హత్య మరునాడే ఆ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ఆర్డినెన్స్‌గా తీసుకువచ్చింది. దభోల్కర్‌పై ప్రేమ నటిస్తూ లౌకికవాద ఫోజుతో ప్రయోజనం పొందాలనేదే దీని వెనకనున్న పరమార్థమనేది స్పష్టం.

* * *

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గత రెండు నెలల్లో నలుగురు జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. 27-8-13న ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ నియోజకవర్గ పరిధిలోని 'ఎటావా'లో ఒక జాతీయ హిందీ దినపత్రికకు పనిచేసే ఓ సీనియర్ విలేఖరి రాకేష్‌శర్మ (50సం॥) హత్యకు గురయ్యారు. బందా, లఖింపూర్ ఖేరీల్లో ఇలాంటి ఘటనలు జరగటానికి ముందు ఒక సీనియర్ జర్నలిస్టుపై దుండగులు దాడిచేశారు. తాజాగా ఆగస్టు 23 నుండి కనబడకుండా పోయిన జర్నలిస్టు జాకావుల్లా మృతదేహం బులంద్‌షహర్‌లో ఒక గోనెసంచిలో పోలీసులు కనుగొన్నారు. ఇతన్ని తీవ్రంగా కొట్టి చంపిన ఆనవాళ్ళున్నాయి.

* * *

బిజెపి, సంఘ్‌పరివార్ హిందూ మతోన్మాదులు బాబ్రీమసీదును కూల్చివేసి 21 సం॥లు కావస్తోంది. ఈ సమస్యను సృష్టించిన కాంగ్రెస్, దీనిని ఆరకుండా ఆజ్యంపోస్తూ రగిలిస్తూ వుంటే, ఈ మొత్తం పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బిజెపిలు - తమ తమ ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నాయి.

ఈ సంవత్సరాంతంలో ఉత్తరభారతంలోని నాలుగు రాష్ట్రాలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో; రానున్న సం॥లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో లబ్ధిపొందేందుకు హిందూ మతోన్మాద శక్తులు ముందస్తు ప్రయత్నాలు ప్రారంభించాయి.

2013 ఆగస్టు 24 నుండి విహెచ్‌పి, భజరంగదళ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో సరయూ నది ఒడ్డునుండి అయోధ్యలోని 'రామజన్మభూమి' వరకు క్రోసి పరిక్రమ యాత్రను చేపట్టాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ యాత్రకు అనుమతి నిరాకరించి పోలీసులను మోహరించి, నిషేదాజ్ఞలు విధించి, యాత్రను అడ్డుకొంది. ప్రవీణ్‌తొగాడియా, అశోక్‌సింఘాల్‌తో సహా 1700మంది అరెస్టయ్యారు. దీనిని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ దేశవ్యాపిత నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చి మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది.

* * *

భారతదేశంలో ప్రముఖ ముస్లిమ్ శిక్షణ మరియు అభివృద్ధి సంస్థ దారుల్ ఉలూమ్, ముస్లిములు ఫోటోలు తీయించుకోవటాన్ని తమ మతాచారాలకు భిన్నమైనదిగా, పాపకార్యంగా ప్రకటిస్తూ ఇటీవల ఫత్వా జారీచేసింది. సౌదీ అరేబియా వంటి మతఛాందస ప్రభుత్వాలపాలనలోనే వారు పవిత్రంగా భావించే మక్కామసీదులో ప్రార్ధనలు చేస్తుండగా, వీడియో తీసి ప్రత్యక్ష ప్రసారం చేస్తుండగా దారుల్ ఉలూమ్ డియోబాండ్ మొహతామిమ్(వైస్ ఛాన్సలర్), ముఫ్తి అబ్దుల్ క్వాజిమ్ నొమాని ఫొటోగ్రఫీని ముస్లిమ్ వ్యతిరేకనేరంగా పేర్కొన్నాడు. ముస్లిములు తమ గుర్తింపుకార్డుల కోసము, పాస్‌పోర్టుల కోసమూ తప్ప మరే సందర్భంలోనూ ఫోటోలు తీయించుకోకూడదని ఫత్వా జారీచేశాడు. తమ శిక్షణ మరియు అభివృద్ధి సంస్థలో విద్యనభ్యసిస్తున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్ధి, ఫోటోగ్రఫీ పట్ల తనకు తీవ్ర ఆసక్తివుందని, దానిని తన కెరీర్‌గా ఎంచుకుంటానని ప్రకటించగా, ఫోటోగ్రఫీ వృత్తి చట్టవ్యతిరేకం, పాపము అని 'హదిత్' ప్రకటిస్తూంది కనుక, ఇంజనీరింగ్‌పై ఆధారపడి వేరే ఇతర వృత్తిని ఎంచుకోమని సలహాఇస్తూ జారీచేసిన ఫత్వాను స్కూలు వెబ్‌సైట్‌లో వుంచారు.

* * *

పైన పేర్కొన్న ఘటనలేవీ విడివిడి ఘటనలు కావు, ఈ ఘటనల మధ్య నున్న గతితార్కిక సంబంధాన్ని తెలుసుకోగలగటం ద్వారానే, గాలివాటు పోరాటాల వెంటపడి కొట్టుకుపోకుండా, ఈ సమస్యలకు మూలమైన అంశంపై పోరాటాన్ని ఎక్కుపెట్ట గలగటం సాధ్యమౌతుంది.

దేశంలోని యావన్మంది ప్రజానీకం సమస్యల విషవలయంలో చిక్కుకొని వున్నారు. కాశ్మీరులో రెచ్చగొట్టబడుతున్న ప్రజల మధ్య ఉద్రిక్తతలు, ఉత్తరప్రదేశ్‌లో ముజఫర్‌నగర్‌లో మతఘర్షణలు; ఘర్షణల్లో, పోలీసు కాల్పులలో అనేకమంది మరణించటం, పెద్దఎత్తున దాడులు, ఆస్తుల విధ్వంసాలు; పాకిస్తాన్, చైనాల కవ్వింపు చర్యలపేరిట జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టే చర్యలు; 'మద్రాసుకెఫే'లో తమిళుల మనోభావాలను గాయపరిచారంటూ ఆ సినిమాకు వ్యతిరేకంగా తమిళనాడులో నిరసనలు, సినిమాహాల్స్‌పై దాడులు సాగించటం; ఈశాన్య రాష్ట్రాలలో సైనిక బలగాల దాడులు; ఉత్తరప్రదేశ్‌లో జర్నలిస్టుల హత్యలు; మహారాష్ట్రలో మహిళా జర్నలిస్టుపై అత్యాచారం, ప్రజాతంత్ర వాదులపై ఫాశిస్టు హంతక దాడులు ; ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతాల ప్రజల మధ్య పెంచుతున్న విద్వేషాలు; తమిళనాడులో కుల ఉన్మాద హత్యలు వంటి ఘటనల నడుమే.... రూపాయికి విలువ మున్నెన్నటికంటే అధఃపాతాళానికి పడిపోతున్న పరిస్థితుల నడుమే ఆగస్టు 15 'స్వాతంత్ర్య దినోత్సవాన్ని' పాలకులు ఎంతో ఆర్భాటంగా నిర్వహించారు.

కాగా, గత 66 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో నూటికి 80మందిగా వున్న గ్రామీణ ప్రాంత రైతుల, వ్యవసాయ కూలీల, చేతివృత్తిదారుల జీవనం భిన్నాభిన్నమైంది ; కుల అణచివేత, పీడనలు కొంగొత్త రూపాల్లో వికృతంగా కోరలు చాస్తున్నాయి; పట్టణప్రాంతాల్లో పారిశ్రామిక కార్మికుల, అసంఘటిత శ్రామికుల అవస్థలు వర్ణనా తీతంగా వున్నాయి. పెరిగిపోయే ధరలు, నిరుద్యోగం, ప్రజలకు అందుబాటులో లేని విద్యా, వైద్యాలు, గృహవసతి వంటి సమస్యలు ప్రజలకు జీవనాన్ని నరక ప్రాయంగా మారుస్తున్నాయి.

సామ్రాజ్యవాదులు, బడాపెట్టుబడిదారులు, ఫ్యూడల్ భూస్వాములు వారి ప్రతినిధులైన దోపిడీ పాలకులు, వారితైనాతీలు, నిరంకుశాధికారులు, బడాకాంట్రాక్టర్లు తెగ బలిసి పోతుండగా, పేదలు నిరుపేదలుగా నికృష్ట జీవనం సాగిస్తున్నారు. అంతరాలు తగ్గటమటుంచి, అంతులేకుండా నానాటికీ తీవ్రమౌతున్న ఈ నేపథ్యం - ఖచ్చితంగా ఏదో ఒకనాడు బ్రద్దలవుతుందని దోపిడీ పాలకులకు తెలుసు. రగులుతున్న ఈ అగ్నిపర్వతం తమ దోపిడీ అధికార పీఠాన్ని తుత్తినియలు చేయకుండా, సాధ్యమైనంత ఎక్కువకాలం తమ దోపిడీ పాలన సజావుగా సాగించుకునేందుకు కావలసిన కుటిల విధానాలను రూపొందించి అమలు చేయుటలో వీరు నిష్ణాతులయ్యారు. అధికారంకోసం పాలక కూటముల మధ్య, పాలక పక్షంలోని వివిధ ముఠాల నడుమ తగువులు పడ్తూనే అంతిమంగా ప్రజలను బలిపశువులుగా చేయటలో గొప్ప ఏకీభావంతో సాగుతున్నారు. ప్రజలమధ్య జాతి, మత, కుల ప్రాంత, బాషా, లింగపరమైన విబేధాలను తీవ్రం చేస్తూనే మరోవైపున హిందూ మతోన్మాదదాడులు, అగ్రకుల దురహంకార హత్యలు, ప్రాంతాల - ప్రజల మధ్య వైషమ్యాలు, స్త్రీలపై అత్యాచారాలను, ఫాసిస్టు దాడులను, భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారు.

ఇంకోవైపున తాత్కాలిక ఉపశమన పథకాలు, ప్రజాకర్షక పథకాలతో ముంచెత్తటం ద్వారా ప్రజలను ఎల్లకాలం తమ సహాయం కోసం ఎదురుచూసే వారిగా దిగజార్చబూనుకున్నారు. పతన సాంస్కృతిక విలువలను పెంచిపోషిస్తూ ; ప్రజలను - ముఖ్యంగా విద్యార్థి యువతను మద్యం మత్తులో ముంచెత్తే, పెడదోవల పట్టించే కుట్రపూరిత విధానాలతో ప్రజల పోరాట చేవను మొద్దు బార్చే ప్రయత్నం చేస్తున్నారు.

సమస్యలతో రగులుతున్న ప్రజానీకం - పాలకుల ఈ కుటిల ఎత్తుగడలనన్నీ అధిగమించి - పాలకుల దుష్టవిధానాలను సవాల్‌చేస్తూ, సంఘటితంగానో, అసంఘటితంగానో వివిధ ప్రాంతాల్లో ఉద్యమిస్తున్నారు. ఏకకాలంలో తమ దుర్మార్గ విధానాలన్నింటినీ పదునుబెడ్తున్న పాలకులు, సమస్యల పరిష్కారాన్ని కోరుతున్న ప్రజలపై పోలీసు బలగాలతో విరుచుకుపడ్తున్నారు.

ఈ నేపథ్యంలో పై పరిణామాలను అర్థం చేసుకుంటే ఈ ఘటనలేవీ విడి విడి ఘటనలు కావని, జెండాలు వేరైనా పాలకుల దుష్ట ప్రణాళికలో భాగంగా వ్యక్తమౌతున్న వివిధ రూపాలుగా గ్రహించగల్గుతాం తద్వారా పాలకుల కుటిల దోపిడీ రాజకీయాలపై లోతైన, విస్తృతమైన పోరాటాన్ని సాగించగలుగుతాం.





THE VOICE OF INDIAN REVOLUTION
A CPI(M-L) TRIBUTE TO COMRADE KANU SANYAL
Price : Rs. 150/-
For Copies :
Mythry Book House
Jaleel street, Karl Marx Road,
VIJAYAWADA - 2


Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010